# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 35 సంచిక 7
పేజీలు 40
మార్చి 2016

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ ,
A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

printed and published by
C.V. Ramana Babu
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Samardha Sadguru Publications,
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh and
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
DUGGIRALA JAGANMOHANA
BALA KRISHNA LAL

**ఈ సంచికలో ............................ ....... పేజీ**

భద్రవాక్యం .......................................2
శ్రీబాబూజీ ఉవాచ.................................3
అమ్మమాట.........................................................6
ఏది సత్యం .......................................8
పరాప్రకృతి – అపరా ప్రకృతి ..................10
శ్రీకంఠార్థ శరీరిణీ ...............................12
స్వామి రామతీర్థ .................................13
హనుమాన్‌చాలీసా ..............................15
యోగవాశిష్ఠము ..................................17
మహాభారత నీతి చంద్రిక......................19
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు...................20
పరిప్రశ్న .........................................21
గృహస్థుని ధర్మములు ........................23
ఎంత సుందరమయ్యా నీ వదనం...........25
శ్రీకృష్ణకర్ణామృతము............................26
సమర్థ సద్గురు యాజమాన్యం వివరాలు....28
రాజయోగము ..................................29
గీతాధ్యయనమ్ ..................................31
అగస్త్యమహర్షి ..................................33
వాసనలు ..................................... 35
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర...........37
విష్ణు కథలు– సూరదాస్ ....................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

అన్యదేవాహు స్సమ్భవాత్ అన్యదాహురసమ్భవాత్ ।
ఇతి శుశ్రుమ ధీరాణామ్ యేనస్తద్విచచక్షిరే ॥
(ఈశావాశ్యోపనిషత్ - 13)

మానవుడు బాహ్య ప్రపంచంలో ఆర్జించిన ధనధాన్యాలు, పశుగణాలు, గృహాలు, పదవులు, కీర్తిప్రతిష్ఠలు శాశ్వతమనుకొని వాటికోసం ఎంతో ఆవేదన చెందుతాడు. వాటి అభివృద్ధి కోసం ఆరాటపడతాడు. అంతేకాదు భార్యాపుత్రులు, బంధువులు, స్నేహితులను శాశ్వతమైన స్థిరమైన సంపదగా భావిస్తాడు.

వాటన్నిటితో సంబంధం ఎంత కాలం? తాను జీవించి వున్నంత వరకే కదా! తన జీవితమనే నాటకం ఎప్పుడు ముగిస్తే ఆ క్షణమే ఆ అనుబంధం తెగిపోతుంది. తాను ఇంతకాలం ప్రేమించినదేదీ తనతో రాదు కదా!

అయితే జీవుడు 84లక్షల జీవరాసుల జన్మలెత్తి ఆ జన్మ పరంపర ద్వారా ఆర్జించిన ఈశ్వరతత్త్వమనే తత్త్వ సంపద, ఈశ్వరవాసన తన వెంట తెచ్చుకుంటాడు. అది తరగని సంపద. మరణంతో అంతరించే ఐహిక సంపదలలాగ కాకుండా తన వెంటనే ఉండి, జీవుడి మనస్సులో మిగిలి ఉన్న కర్మవాసనలను దగ్ధం చేస్తున్నాయి.

ఈ విషయాన్ని సాధకుడు మహాపురుషులు లేక జ్ఞానుల సమాశ్రయం ద్వారా గ్రహించి, వివేకవంతుడై తన జన్మని తప్పక సార్థకం చేసుకుంటాడు.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

'మహాత్ములకు మనస్సు ఉంటుందా? వారికి మనస్సు లేకపోతే సంఘంలో ఎలా సంచరించ గల్గుతున్నారు? పోనీ మనస్సు ఉంటే ఆత్మానందాన్ని ఎలా పొందగల్గుతున్నారు?' అన్న ప్రశ్నకు సమాధానంగా బోధచేస్తూ శ్రీ బాబూజీ మహరాజ్ "మహాత్ములకు, జ్ఞానులకు మనస్సు ఉంటుంది. ఆ సబ్జక్టు మీకు ఎంత చెప్పినా ఆ స్థితిలో లేకపోతే అర్థం చేసుకోవడం చాలాకష్టం. కుమ్మరి పురుగు బురదలోనే ఉంటుంది. కానీ దాని శరీరానికి బురద అంటదు కదా! అలాగే వర్షపునీరు భూమి మీద పడితే భూమిలోకి వెడుతుంది. నీటిలో పడితే ఆ నీటితో కలిసిపోతుంది. కానీ ఆ



చెరువులోనే ఉన్న తామరాకుపై పడిందనుకోండి ఆ నీటిబొట్టు జారిపోతుంది కానీ తామరాకుకు అంటుకోదు. అలాగే మహాత్ములు గానీ, జ్ఞానులుగానీ సంఘంలో ఉన్నా వారి మనస్సు అంతర్ముఖమై ఆత్మానందంలో ఓలలాడుతూ ఉంటుంది. ప్రాపంచిక విషయాదులకు మనస్సు స్పందించదు. కాబట్టి మహాత్ములు సంఘంలో ఉన్నా నిస్సంగులే. సామాన్య మానవుడి లాగా దేహధారణ చేసి అన్ని ప్రాపంచిక వ్యవహారాల్లోనూ కలుగజేసుకున్నా వారి మనస్సుకు ఏ విషయమూ అంటదు. వారు అమనస్కస్థితిలో ఉంటారు.

సాధకులకు జీవదృష్టి పోనంతవరకు జగత్తు గోచరిస్తూనే వుంటుంది. జీవదృష్టి తొలగిన వెంటనే ఈ జగత్తు అంతా అసత్యమనే భావనేగాక అనుభూతి కూడా కలుగుతుంది. జీవదృష్టి తొలగని సాధకుడు కళ్ళు మూసుకుని ఎంతసేపు ధ్యానం చేసినా జగత్తు గోచరించక మానదు. మనో వికారాలు తప్పవు. ఎందువలన అంటే అక్కడ మనస్సు బహిర్ముఖమై ఉంది. కానీ జ్ఞాని కన్నులు మూసుకున్నా లేక తెరుచుకొని ఉన్నా బ్రహ్మమే గోచరిస్తుంది. జగత్తు కానరాదు. ఆయనకి జీవదృష్టిలేదు. మనో వికారాలు ఉండవు.

సాధకులు ఇంద్రియ నిగ్రహము కొరకు చిత్తవృత్తి నిరోధము కొరకు ఎంతో శ్రమపడతారు. అది అంతా వ్యర్థప్రయత్నము. సద్గురు మూర్తి సూచించిన విధంగా మనస్సును నిగ్రహించగల్గితే చిత్తవృత్తి నిరోధము, ఇంద్రియ నిగ్రహము చాలా తేలికగా సాధించగల్గుతాడు. మనోనిగ్రహం సాధించాలి అంటే తన యథార్థ రూపము తెలుసుకోవాలి. 'అసలు నేనెవరు?' అని ప్రశ్నించుకుని నేను ఈ శరీరముకాదు, ఇంద్రియములు కాదు, నేను సత్తు, త్రికాలముల యందు నశించనివాడిని, నేను జ్ఞానస్వరూపుడను అనే భావనతో సంకల్పములన్నిటినీ త్యాగం చేసి ఉండే మహాత్ముడు బ్రహ్మానందంలో ఓలలాడతాడు. ఆయనకు విషయాదులతో పని ఏముంది? విషయాదులను గుర్తించే స్థితిలో కూడా ఉండడు. పంచదారగానీ, లవణముగానీ నీటిలో వేసినపుడు ఎలా కరిగిపోతాయో అలాగే మహాత్ముల మనస్సు బ్రహ్మము నందు లయించిపోతుంది.

మీకు ఇంకొక దృష్టాంతము చెబుతాను. సాధకుల మనస్సు విషయాదులయందు సంచరించినంతకాలము బహిర్ముఖమై సుఖము కల్గినపుడు ఆనందిస్తూ కష్టము కల్గినపుడు దుఃఖిస్తూ వుంటుంది. కానీ మనస్సు అంతర్ముఖమై ఆత్మవస్తువునందు లయించినంతనే నిలిచిపోతుంది. ఇక అది చలించదు.

తుమ్మెద అన్నిరకాల పుష్పాలయందు సంచరిస్తూ వాటియందు గల మకరందము గ్రోలుతూ ఆనందిస్తుంది. కానీ సంపెంగ పుష్పమును స్పర్శతగిలిన మరుక్షణం నశిస్తుంది. మహాత్ముల మనస్సు బ్రహ్మానందము గ్రోలుతూ నిశ్చల స్థితిలో ఉంటుంది. నిశ్చలమైన మనస్సు గుణరహితమై ఏ రకమైన వికారములు ఉండవు. సూర్యుడు అస్తమించినపుడు ఆయనతో పాటుగా కాంతి కిరణములు కూడా అదృశ్యమవుతున్నాయి కదా! మనస్సు కూడా అంతే. దారాపుత్రాదులు, బంధుమిత్రులు, సర్వసంసారమూ మనస్సు ద్వారానే గుర్తింపబడుతుంది. పరిపక్వస్థితిలో ఉన్న భక్తుని మనస్సు ఆత్మదర్శనం పొందిన తరువాత సర్వత్రా జ్ఞానమే కానీ అజ్ఞానము గోచరిస్తుందా? ఎన్ని వేదములు చదివినా, ఎన్ని పుణ్యక్షేత్రములు దర్శించినా, పుణ్యతీర్థములు

సేవించినా, జపతపములు చేసినా మనస్సు నిశ్చలస్థితిని పొందని యెడల ఆత్మానందమును పొందటం అసాధ్యము. గాఢసుషుప్తిలో మనస్సు లేదు కదా! అప్పుడు ప్రపంచమూలేదు. కాబట్టి ప్రపంచమును గుర్తించుటకు కారణము మనస్సే. మనస్సు మేలుకున్నప్పుడే ప్రపంచాన్ని చూడగల్గుతాము. కాబట్టి బంధమోక్షములకు, సంకల్పవికల్పాలకు, కార్యాకార్యములకు మనస్సే కారణమని తెలుసుకోవాలి.

మానవుడు జన్మజన్మల నుండి చేసిన కర్మవాసనలు మనస్సునందే ఇమిడి ఉంటాయి. అంతేకాదు మనస్సు ఇంద్రియాలతో, విషయాదులతో కూడి, సుఖము, దుఃఖము కూడా కలుగ జేస్తుంది. దానిని అధిగమించాలంటే సద్గురుమూర్తిని ఆశ్రయించి ఆయన అనుగ్రహము ద్వారా ఆత్మానుభూతిని పొందినపుడే మనస్సు కర్మవాసనలు నుండి క్షాళన చెందుతుంది. ఇది మాత్రం సత్యం.

జ్ఞాన శూన్యుడైన సాధకుడు ప్రాణాయామము, హఠయోగము లేదా ఇతర భౌతిక ప్రక్రియల ద్వారా గాని యోగము ద్వారా గాని మనస్సుని నిలిపి తాత్కాలికముగా సమాధి స్థితిని పొందినా ఆ స్థితినుండి బయటకు వచ్చిన వెంటనే మనస్సు యథాస్థితిని పొందకమానదు. గాఢ సుషుప్తిలో మనస్సు ఎంత అణిగియున్నా మెలకువ రాగానే దాని యథాస్థితిని ఎలా పొందగల్గుతోందో ఇది కూడా అంతే.

జ్ఞాన సంపన్నుడైన సాధకుని మనస్సు వాసనారహిత మవుతుంది కాబట్టి మనస్సు పొందిన నిశ్చలస్థితి శాశ్వతమైనది. మహాత్ముల మనస్సు ఆ స్థితిలో ఉంటుంది. తాత్కాలికంగా యోగసమాధి ద్వారా నిశ్చలస్థితిని పొందిన మనస్సు సమాధినుండి బయటికి వచ్చిన వెంటనే మేడపై మెట్టు నుండి జారిన బంతి ఎలా దొర్లుకుంటూ క్రిందికి వస్తుందో అలాగ దిగజారి విషయాదుల వెంట పడుతుంది" అన్నారు.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## మంత్రమూలం - గురోర్వాక్యం

“మమకారములో పడకుమురా,
మాధవుని తలపరా! జీవా!

చ॥ భార్యాపుత్రుల, బంధుమిత్రుల
మమకారములు మాయలేరా!
మరువకురా మాధవుని పదములు (చరణములు)
మదిలో సదా! నిలుపరా! ॥మమ॥

చ॥ అది నాది - ఇది నాదని
విర్రవీగెదవు - జీవా!
ఏదీ నీది కాదురా!
నేను - నాది - దూరమైనప్పుడు,
నీవు నీవుగా నిలిచెదవురా
ఇది నిజమురా - ఇదే సత్యమురా! ॥మమ॥

చ॥ కామ, క్రోధ, మద, లోభ, మోహములు
కానరాక నిను కబళించునురా
కాంచలేవురా-సత్యమార్గమును,
గురుచరణములే-నిను రక్షించును ॥మమ॥

(ఈ కీర్తన పాడి శ్రీమాతాజీ ఈ క్రింది విధంగా బోధ చేశారు)

“ఈ కీర్తన శ్రీబాబూజీ వ్రాసినదే. అది సాక్షాత్ గురుముఖతః ఆసువుగా వెలువడిన అమృతఝరి. నేను వేరే ఉపన్యాసం చెప్పనక్కర లేకుండా ఆ కీర్తనలోనే వుంది కావలసిన బోధ అంతా. అయితే మనం కూడా జరిగిన సంగతులు, మనం అనుభవించిన విషయాలు చెప్పుకుంటే ఎక్కువ ఆసక్తికరంగా వుంటుంది కదా! అసలు నాన్నగారి వాక్కమ్మట ఈ పాట ఎలా వచ్చిందో చెప్తాను.

అది 1983వ సంవత్సరం. శ్రీబాబు అమెరికా నుండి తిరిగి వచ్చాక, వైజాగ్‌లో శ్రీ పాలూరి రమణగారు అద్దెకి తీసుకున్న ఒక యింట్లో మూడునెలలు ఉన్నారు. అది ఎవరి ఇల్లో, ఏమో! ఆ ఇల్లు చేసుకున్న అదృష్టం అది! సాక్షాత్ శివస్వరూపులైన శ్రీసద్గురుమూర్తి ఆ యింట్లో

అన్ని రోజులు, తన భక్తులందిరతో కలిస ఉండటమే కాక, ప్రతినిత్యం రెండు వేళలా ప్రార్థన, సత్సంగ సమావేశాలు, తరచు పాదపూజలు! సంకీర్తన! ఓహ్! ఏమా భాగ్యం! ఏమా వైభవం! ఇక భోజనాలు సరేసరి!

ఏనాడో పాండురంగడితో కలిసి జ్ఞానదేవుడు, నామదేవుడు ఇత్యాది భక్తులు నిరంతరం సంకీర్తన, బోధ, భోజనాలు చేసుకున్నారంటే ఈనాడు మనకేం లోటు చేశారు మన గురుమూర్తి? రంగరంగ వైభంగా, నిత్యకల్యాణం, పచ్చతోరణంగా గడిచాయి ఆ రోజులు.

ఇలా ఉండగా ఒక రోజు శ్రీమతి సువర్చలమ్మగారు - టెలిఫోన్ ఆపరేటర్‌గా పనిచేసేవారు. ఆవిడ మన రత్నాలమ్మగారి చెల్లెలు. వైజాగ్ శ్రీబాబు దర్శనార్థం వచ్చారు. ఆమెను నాన్నగారు (శ్రీబాబు) 'అత్తయ్యా' అని పిలిచే వారు. మంచి భక్తురాలు. అయితే కొన్ని 'మ'కారాలుంటూ ఉండేవి. సహజం కదా! కొన్నాళ్ళు యీ సంసారంలో వుండేసరికి కొన్ని బంధాలలో చిక్కుకుంటాడు మానవుడు. ఆమెకు ఒక్కగానొక్క కూతురు. పాపం! ఆమె ఏవో కష్టాలలో వుంది. సరే నాన్నగారి దర్శనార్థం వచ్చింది. స్వామి ఇంటర్వ్యూ ఇచ్చేసరికి ఇహ మొదలు పెట్టింది ఆవిడ. తనకు కలిగిన కష్టాలు, ఒకటేమిటి ఇక బాబు ఛాన్స్ ఇవ్వాలేగాని, మన అందరం అంతే కదా! ఇక ఫుల్‌స్టాప్, కామా లేకుండా చెప్పుకుపోతోంది ఆవిడ. ఆవిడ చెప్పటం అయ్యాక, నాన్నగారు మొదలు పెట్టారు ......

'మమకారములో పడకమురా' అని ఆ పాట ఆసువుగా వారి నోటమ్మట బయలువెడలింది. మహాత్ముల వాక్కులలో ప్రతి అక్షరం పరమ అమృత బోధే కదా! ఆహా! జీవులపై - ఈ సంసార చక్రంలో పడి కొట్టుకు పోతున్న జీవులపై ఎంత అపార కరుణ!

"ఓరీ! వెర్రి మానవుడా! ఎందుకు అనవసరంగా మమకారంలో పడి కొట్టుకుపోతున్నావు? మాధవుని తలచుకోరా జీవా! నిన్ను రక్షిస్తాడు. ఈ భార్యాపుత్రులు, బంధుమిత్రుల యొక్క ప్రేమలన్నీ మాయే సుమా! అవన్నీ కళంకంతో కూడుకున్నవి. మారిపోయేవి. ఇవాళ ఆహా! ఓహో! అన్నవాళ్ళు రేపు నీ వైపు కన్నెత్తి అయినా చూడరు. కాని భగవంతుని ప్రేమ సుస్థిరమైనది. కళంక రహితమైనది. మారనటువంటిది. ఆయన స్మరణ మరువకురా. ఆ స్మరణే నిన్ను రక్షిస్తుంది. ఆ మాధవుని పదములను మనస్సులో స్థిరంగా నిలుపుకోరా! అది మటుకు మరువకురా జీవా!"

- సశేషం

# ఏది సత్యం?

- యమ్.పి. పండిట్

భృగువు పురాణ ప్రసిద్ధుడైన వరుణుని కనిష్ఠ పుత్రుడు. భృగువు భక్తితో తండ్రిని సమీపించి అడిగాడు. "మహాత్మా! శాశ్వతమైనది, సత్యమైనది ఏదైనా వున్నదా? శాశ్వతంగా ఉండేదే సత్యమైనదా? తండ్రీ! బోధించండి."

ఆ ప్రశ్నకు తండ్రి ఎంతో సంతోషించి, 'నాయనా! మంచి ప్రశ్న వేశావు. దేని నుండి ఈ ప్రపంచం ఉద్భవించిందో, దేనిలో ఇది వర్ధిల్లు చున్నదో, దేనిలో ఇది అంతమౌతోందో అదే సత్యమైనది. కుమారా! ఈ సత్యాన్ని నువ్వే అన్వేషించు" అన్నాడు.

భృగువు ఈ ఉపదేశంతో వెళ్ళి విచారణ ఆరంభించాడు. ఆ సత్య దర్శనానికై ధ్యానం చేస్తున్నాడు. అతనికి సమాధానం దొరికింది 'పదార్థమే సత్యమైనది, ఆ పదార్థం నుండే సకలం వుద్భవిస్తోంది, ఆ పదార్థంలోనే అంతమైపోతోంది' అని.

భృగువు తండ్రిని సమీపించి, తాను కనుక్కున విషయాన్ని చెప్పాడు. కాని తండ్రికి యీ సమాధానం నచ్చలేదు. అందుచేత తిరిగి అన్వేషణ కొనసాగించమన్నాడు. ఏకాగ్రత సత్యానికి రాచబాట.

భృగువు మళ్ళీ అన్వేషణ ప్రారంభించాడు. ప్రాణమే సత్యమని తెలుసుకున్నాడు. జీవులన్నీ ప్రాణంలో నుండే వస్తున్నాయి, ప్రాణంతోటే నిలుస్తున్నాయి, తిరిగి అనంత ప్రాణంలో కలుస్తున్నాయి.

భృగువు తండ్రిని సమీపించి తను కనుగొన్న విషయాన్ని తెలిపాడు. తండ్రి తిరిగి అన్వేషణ కొనసాగించమన్నాడు.

భృగువు తిరిగి అన్వేషణ చేసి, మనస్సే సత్యమని కనుగొన్నాడు. మనస్సు ద్వారానే యిదంతా జరుగుతున్నదని భావించి తండ్రికి తెలియ జేశాడు. కాని తండ్రి తిరిగి అన్వేషణ ఇంకా లోతుగా చేయమన్నాడు.

భృగువు మళ్ళీ విచారణలో మునిగి జ్ఞానమే సత్యమని తెలుసుకుని, జ్ఞానంలోనే జీవులు పుట్టి, జ్ఞానంలోనే జీవించి, తిరిగి ఆ జ్ఞానంలోనే లయిస్తున్నాయని తన తండ్రికి తెలియజేశాడు. భృగువును

మరింత ముందుకు అన్వేషణ చేయమని చెప్పాడు తండ్రి.

ఈసారి భృగువు ఆనందమే సత్యమని గ్రహించాడు. ఆనందంలో నుండే జీవులు పుడుతూ, ఆనందంలోనే పెరుగుతూ, ఆనందంలోనే లయించిపోతున్నాయని తన తండ్రికి తెలియజేశాడు.

అట్లా వరుణ కుమారుడు భృగువు పూర్ణ సత్యాన్ని కనుగొన్నాడు. వరుణుడు తన కుమారుని పాక్షిక సత్యాలతో సంతృప్తి పడక, పూర్ణ సత్యం లోకి పంపించాడు.

అవును పదార్థం సత్యమే. కాని అదే పూర్ణ సత్యం కాదు. అలాగే ప్రాణము, మనస్సు, జ్ఞానము, ఆనందమూ ఇవన్నీ సత్యాలే. కానీ పూర్ణ సత్యములు కాదు. ఇవన్నీ పాక్షిక సత్యాలే.

భృగువు పూర్ణ సత్యాన్ని అనేక దశల్లో అంతస్తుల ద్వారా తెలుసుకున్నాడు. సత్యం అనేక రూపాల్లో అంతస్తులలో అభివ్యక్త మవుతోంది. ఆ చరమ తత్త్వమే పదార్థంగా, ప్రాణంగా, మనస్సుగా, జ్ఞానంగా, ఆనందంగా వ్యక్తమౌతోంది. ప్రతి ఒక్కటీ సత్యమైనదే. అట్లా అవన్నీ సత్యమైనవే. ఎందుచేతనంటే చరమ తత్వం యొక్క, ఆ పూర్ణ సత్యం యొక్క వ్యక్త రూపాలే ఇవన్నీ కనుక.

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా మార్చి2016, ఏప్రియల్ 2016 ల లో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

మార్చి 2016 : AS 0700, 6362, 6678, 6809, 7066, 7068, 7069, 7071, AS 7072, 7073, 7074, 7076, 7078, 7082, 7083, 7084, AS 7085, 7090.

ఏప్రియల్ 2016 : AS 4166, 6371, 6859, 6861, 7096, 7097, 7098, AS 7099, 7100, 7101, 7102, 7107, 7108, 7116, AS 7119.

– మేనేజర్

# బ్రహ్మవిత్ ఆప్నోతి పరమ్

- పరాశర ప్రసాద్

మోక్షం, పరం, శాంతి, ఆనందం ఇవన్నీ బ్రహ్మమును సూచించే పదములే. బ్రహ్మవేత్త బ్రహ్మమే అవుతున్నాడు. బ్రహ్మము సత్యము, జ్ఞానము, అనంతము అనే లక్షణాలు గలది అని చెప్పబడుతోంది. యదార్థంగా బ్రహ్మము ఏకము అద్వితీయము కదా! అది వస్తువు కాదు. అందుకే మనోవాక్కులకు, సత్యాసత్యములకు, అస్థిత్వానాస్తిత్వాలకు అతీమైనది. మనోవృత్తులకు అందదు.

వస్తువును నిర్దేశించటానికి తోడ్పడే స్వరూపలక్షణాలుగాని, తటస్థ లక్షణాలుగాని బ్రహ్మమునకు వర్తించవు. వస్తువులాగ బ్రహ్మము అనిత్యము, జడము కాదని తెలియజేయటానికి అన్నట్లుగా సత్యము, జ్ఞానము, అనంతము అనే లక్షణాలుగా చెప్పబడ్డాయి. కాని బ్రహ్మము అద్వయం అనంతం కాబట్టి స్వగత, స్వజాతీయ, విజాతీయ భేదాలు లేవు. వస్తువులో ఎరుపు తెలుపు అని, పొడవు పొట్టి అని, సువాసన గలది లేనిది అనే భేదాలు ఉంటాయి. కాని బ్రహ్మములో సత్యాది లక్షణాలు సమానార్థకములు. బ్రహ్మమే సత్యము. సత్యమే జ్ఞానము. జ్ఞానమే అనంతముగా తెలుసుకోవాలి.

బ్రహ్మానుభూతిని పొందిన సాధకుని మనస్సులో చిత్తవృత్తులన్నీ నిరోధింపబడి, బ్రహ్మాకార వృత్తి మాత్రమే మిగిలి ఉండి, చివరికి అది కూడా అదృశ్యమై, మనస్సుకు, వాక్కుకు, ఇంద్రియాలకు కూడా అందని పరబ్రహ్మమే సాక్షాత్కరిస్తుంది. సాక్షాత్కారము అంటే ఉన్నది గుర్తింప బడటము. క్రొత్తగా వచ్చేది కాదు. సత్యమైనది బ్రహ్మము అనేది అందరికీ అవగతమైనదే. కాని సత్యము అనేది మూడు విధాలుగా గుర్తించబడుతోంది. ఏ వ్యక్తికైనా ఎవరు నీవు అని ప్రశ్నిస్తే, వెంటనే ఆ వ్యక్తి నేను కృష్ణ అనో, గోపాల్ అనో చెప్పవచ్చు. అది వ్యావహారిక సత్యం. ప్రపంచంలో దేనికైనా వ్యావహారికంగా గుర్తించటానికి నామరూపాలు ప్రధానం కాబట్టి అవి జాగ్రదావస్థలో సత్యంగా గోచరిస్తాయి. ఈ సత్యాలు జనన మరణాల ద్వారా అనిత్యాలు అవుతాయి.

స్వప్నావస్థలో ఎన్నో దృశ్యాలు గోచరమవుతాయి. అవి యథార్థాలు కావు. స్వప్నం నుంచి మేల్కోగానే అవి అదృశ్యమవుతాయి. అలాంటి

యదార్థ జీవితంలో మానవుడు భ్రాంతి చేత త్రాడును చూసి పాముగా భావించటం, శుక్తికంలో వెండిని చూడటం లాంటివి. అలాగే అహంకారమును తానుపై ఆరోపించుకుని, 'నేను' అని చలామణి అవుతూ, నేను తింటున్నాను, నేను నడుస్తున్నాను అంటాడు. ఇదే ప్రాతిభాసిక సత్యము అని పిలువబడుతోంది.

భ్రాంతి ఉన్నంతవరకూ అది సత్యమే. భ్రాంతి తొలగిన వెంటనే అది సత్యము కాదని తెలుస్తోంది. బ్రహ్మము మాత్రము జన్మ, మృత్యు, పరిణామాది ధర్మాలకు అతీతం. అందువలన బ్రహ్మము పారిమార్థిక సత్యము. కనుకనే సత్యము అనునది బ్రహ్మమునకు స్వరూప లక్షణంగా చెప్పబడినది. 'నేను' అనేది భావాతీతమైనది. రూపనామ క్రియారహిత మైనది. అది కేవలం ఉనికి. క్రియకు ఆధారము. అందువలననే పారమార్థిక సత్యం.

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

మార్చి 2016

4 శుక్రవారం శ్రీగురుదశమి; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

23 బుధవారం ఫాల్గుణ పౌర్ణమి; హెూలీ సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

ఏప్రియల్ 2016

2 శనివారం శ్రీగురుదశమి; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

8 శుక్రవారం ఉగాది. శ్రీగురుదశమి; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

# శ్రీకంఠార్థ శరీరిణీ

- పాలూరి కాళీప్రసాద్



జగన్మాతకు ఉన్న అనంతమైన నామాలలో 'శ్రీకంఠార్థ శరీరిణీ' ఒకటి. శ్రీకంఠుడైన పరమేశ్వరుని శరీరంలో అర్థభాగమైన తల్లి. శ్రీకంఠుడు అంటే మంగళకరమైన కంఠము కలవాడు. మరి ఆయన కంఠం మంగళకరం ఎలా అయింది? అంటే లోకాలన్నింటినీ త్రుటిలో భస్మీపటలం చేయగల హాలాహలాన్ని తన కంఠంలో నిలుపుకున్నాడు కాబట్టి. అయితే యీ ఘటనలో అమ్మవారి పాత్ర విశేషమైనది.

మ్రింగెడి వాడు విభుండని
మ్రింగెడిది గరళమనియు మేలని ప్రజకున్
మ్రింగుమనె సర్వమంగళ
మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో

అన్నారు శ్రీపోతనామాత్యులు. చేసేది ఎంత ప్రమాదకరమైన పనో తెలిసి కూడా తన భర్తని అందుకు ప్రోత్సహించింది ఆ తల్లి. అయితే ఆయన ఒక్కడే మ్రింగాడా? అంటే లేదు. ఆయనతో సమానంగా ఆవిడ కూడా మ్రింగింది. ఎందుకంటే ఆ తల్లి శ్రీకంఠార్థ శరీరిణీ.

మరి తన మాంగల్యం మీద అంత నమ్మకం ఎందుకు? అంటే 'శివా రుద్రస్య భేషజీ' అని చెప్పారు. ఆయనకు ఏం జరిగినా తిరిగి స్వస్థత చేకూర్చగల అద్భుత వైద్యురాలు ఆ తల్లి.

మరి మన మాటేమిటి? అని దిగులు పడక్కర్లేదు. 'శివా విశ్వస్య భేషజీ' - మన రోగాలన్నీ కూడా నివారించే భవరోగ వైద్యురాలు ఆ తల్లి. అటువంటి చల్లని తల్లి మనందరికీ ఆయురారోగ్యాలను, తరగని సంపదయైన ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించమని ప్రార్థిస్తూ.... పాఠకులందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు!

# స్వామి రామతీర్థ

- రమణ ప్రసాద్

స్వామి రామతీర్థ మురళీవాలా గ్రామం(ప్రస్థుత పాకిస్థాన్)లో ది. 22-10-1873లో జన్మించారు. వీరు లాహోరులో విద్యను అభ్యసించి, వేదాంత ప్రచారమే వృత్తిగా చేసికొని, ది.27-10-1906 తన 33వ ఏట టెహరీలో(ఉత్తర ప్రదేశ్) జల సమాధి పొందారు. స్వామి వివేకానంద స్వామి తరువాత హిందూమతమును గురించి1902అమెరికాలో ప్రవచించిన మహాత్ములు వీరే. అమెరికాలో practical vedanta,and education of youth అనే అంశాలపై ఎన్నో ప్రవచనాలు చేశారు. ఎంతోమంది విద్యార్థులకు అమెరికాలో ఉన్నతవిద్యావకాశాలు కల్పించారు. లక్షలాది ప్రజల కష్టాలు బాపి వారికి సుఖ సంతోషాలను కలిగించారు. వీరి తండ్రి హీరానంద్ గోసాయి ఒక గుడిలో అర్చకులుగా ఉండేవారు.



యీాయనను తీరధ్ రామ్ అని పిలిచేవారు. ఎప్పుడూ చిరునవ్వులుచిందించే ఈ బాలుని చూసి, " ఈతడు గొప్ప పండితుడు అవుతాడని, తన దేశానికి ఎంతో ఖ్యాతి తెస్తాడని జ్యోతిష్కులు భవిష్యవాణి పలికారు. వీరి జీవితం ఎంతో పేదరికంతో గడిచింది. ఈ బీదరికమే తన పాలిట వరంగా భావించారు. వీరి కీర్తి నలుదశలా ప్రాకినా వీరు బీదవానిగానే మిగిలిపోయారు. సమస్తాన్నీ త్యజించి సూఫీ సంతులలాగా భగవన్నామమనే ధనాన్ని కూడగట్టుకొన్నారు. చిన్నప్పటినుంచి భగవత్కథా కాలక్షేపాలన్నా, ఆధ్యాత్మ ప్రవచనాలన్నా ఎంతో మక్కువ చూపేవారు.

పదేళ్ల వయస్సులో వీరికి వివాహం అయింది. అయన తండ్రి మరణిస్తూ తీరధ్ రామ్‌ను భక్త ధన రామ్ అనే సౌమ్యశీలి సంరక్షణలో ఉంచారు. రామ్ ఆయనను తన గురువుగా భావించి తన తను మన ధనాలను ఆయనకు అర్పించారు. ఆయన ఆజ్ఞ లేనిదే ఏదీ చేసేవాడు కాడు. తాను ఎక్కడ ఉన్నా ఆయనకు ప్రీతి కలిగించే ఉత్తరాలు వ్రాసేవాడు.

రామ్ ఎంతో తెలివైన విద్యార్థిగా ఉండేవాడు. గణిత శాస్త్రం పట్ల ఎంతో ఆసక్తి చూపేవాడు. గణిత శాస్త్రంలో ఎం.ఏ డిగ్రీ పొంది, ఫోర్‌మెన్ క్రిష్టియన్ కాలేజ్‌లో మేథమెటిక్స్ ప్రొఫెసరుగా పనిచేశారు. ఆసమయంలో ఆయన భగవద్గీతను అధ్యయనం చేశారు. ఆయనకు కృష్ణునిపై ఎంతో భక్తి ప్రపత్తులు కలిగాయి. కృష్ణ దర్శనం కోసం ఎంతో పరితపించేవారు. భక్తి అనే అంశం పైన లాహోరులోని సనాతన సభలలో ఎన్నో ప్రవచనాలు

చేశారు. ఆయన తన ఆధ్యాత్మికజీవితాన్ని ఒక భగవద్భక్తునిగా ప్రారంభించి వేదాంత విషయాలను ద్వారకామఠ్‌లో శ్రీ మాధవతీర్థ వద్ద తెలుసుకొన్నారు. ఆ తరువాత ఆయన పేరు 'స్వామి రామతీర్థ'గా మారింది.

లాహోరులో స్వామి వివేకానందను దర్శించి ఎంతో ఎంతో ప్రభావితులైనారు. సన్న్యాసం తీసుకోవాలనే కోరిక ఆయనలో గాఢంగా నాటుకొంది. ఆయన భగవంతుని చూడాలని పరితపించారు. తత్ఫలితంగా ఆయనకు భగవద్దర్శనం అయింది. ఆ క్షణంనుంచి ఆయన భగవంతునితో ఉన్నారు. భగవంతుడు నడిపించినట్లు నడిచారు. ఆయన అంతటా భగవంతుడినే చూశారు. తరచు ఆయన చెట్లలో , నదులలో, పర్వతాలలో భగవంతుడిని దర్శించి తన్మయత్వం పొందేవారు.

కొద్ది కాలానికే తన పదవికి రాజీనామా చేసి హిమాలయాలకి వెళ్ళిపోయారు. ఆయన భార్య, ఇద్దరు పుత్రులు ఆయన వెంట నడిచారు. ఆయన భార్య అనారోగ్య కారణాలవల్ల ఒక కుమారునితో తన గ్రామానికి వెళ్ళిపోగా. ఇంకొక కుమారుడు టెహరీలో విద్యాభ్యాసం చేయసాగాడు.

స్వామి వివేకానంద కొద్ది రోజులకు శరీర త్యాగం చేస్తారనగా తీరథరామ్ సన్యాసం తీసుకొన్నాడు. కొన్ని సంవత్సరాల తరవాత మానవాళి మధ్యకు వచ్చి అనేక దివ్య ప్రసంగాలు చేశాడు. ఆ ప్రసంగాలకు ప్రజలు ముగ్ధులైనారు. వారి వదనంలో వెలిగే ప్రసన్నతకు, పక్షులు చేసే విధంగా వారు చేసే ఓంకారనాదానికి శ్రోతలలో దివ్యానుభూతిని కలుగజేసింది.

ఆధ్యాత్మిక సందేశాన్ని విదేశాలలో చాటాలనే తీవ్ర ఆకాంక్ష ఆయన దేశాంతర పయనానికి దారి తీసింది. 1900లో తన శిష్యుడైన స్వామి నారాయణతో టోకియోలో విజయవంతంగా తాను అభిలషించిన లక్ష్యాన్ని సాధించి అమెరికాలోని శాన్‌ఫ్రానిసిస్కోలో డాక్టర్ ఆల్బర్ట్ హిల్లర్‌గారితో ఒకటిన్నర సంవత్సరాలు ఉండి వేదాంత ప్రచారం చేశారు. ఎంతోమంది ఆయన అనుయాయులుగా మారారు. ఎన్నో శాఖలను నెలకొల్పారు. హెర్మిటిక్ బ్రదర్‌హుడ్ శాఖ వాటిలో ఒకటి. వేదాంత శిక్షణా కేంద్రంగా ఆ శాఖ రూపు దిద్దుకుంది. ఆయన వ్యక్తిత్వం అమెరికా దేశస్థులను అమితంగా ఆకట్టుకొంది. ఎంతో మంది అమెరికన్లు ఆయనను "లివింగ్ క్రైస్ట్"గా భావించారు. ఈజిప్ట్‌లో మహమ్మదీయులు ఆయనను ఎంతో ఆదరించారు. దానికి కారణం ఆయన అక్కడ మాస్క్‌లో పారసీభాషలో ఉపన్యసించి వారిని ముగ్ధులను చేశారు. వారికి పలు భాషలలో ఎంతో ప్రావీణ్యత ఉంది.

- సశేషం

# హనుమాన్ చాలీసా - కొంపెల్ల రామకృష్ణ

1.జయ హనుమాన జ్ఞానగుణసాగర ।
జయ కపీశ తిహులోక ఉజాగర ॥



హనుమాన్ అంటే అర్థం ఏమిటి? హనువు అంటే దవడ. హనుమాన్ అంటే మంచి బలిష్ఠమైన దవడలు గలవాడు అని అర్థం. హనుమంతుడు సూర్యుని పండు అనుకుని మ్రింగదలచినప్పుడు, ఇంద్రుడు వజ్రాయుధంతో కొట్టగా, హనుమకు ఆ పేరు వచ్చింది.

హనువు అంటే జ్ఞానము అనే మరొక అర్థం కూడా ఉంది. యాగము చేసేటప్పుడు అగ్నిని పుట్టిస్తారు. జమ్మిచెక్కలు రెండు ఒకదానికొకటి రాపిడి చేయటం ద్వారా అగ్ని పుడుతుంది. అగ్ని వాక్స్వరూపము. వాక్కు అంటే జ్ఞానము. రెండు దవడలు ఒకదానిపై మరొకటి కదిలినప్పుడే వాక్కు పుడుతుంది. కనుక హనుమ అంటే జ్ఞానము లేదా వాక్కు కలవాడు. అందుకే గోస్వామి తులసీదాస్ జ్ఞానగుణ సాగర అన్నాడు. అంతులేనిది సాగరము. అంతులేని జ్ఞానగుణములను సాగరమువలె కలిగినవాడు అని అర్థం.

కపీశ అంటే కోతులలో శ్రేష్ఠుడు అని అర్థం. కోతులకు రాజు అని కూడా ఉంది. మరొక అర్థం కపి రూపంలో ఉన్న ఈశ్వరుడు అని. హనుమ శివాంశ సంభూతుడు అని ప్రస్ఫుటం అవుతోంది.

సాగరం దాటేటప్పుడు మూడులోకాలకు తన శరీరాన్ని పెంచాడు. అలాగే సూర్యుడి దగ్గర విద్యనేర్చినప్పుడు ముల్లోకాలూ వ్యాపించాడు. జయ కపీశ తిహులోక ఉజాగర అంటే ఆయన కీర్తి ముల్లోకాలలో వ్యాపించినది అని.

2. రామదూత అతులిత బలధామ ।
అంజనీపుత్ర పవనసుత నామ ॥

రామదుత అయిన హనుమ ఎలాంటివాడంటే ఇంకొకరితో పోలిక చెయ్యలేని బలము కలవాడు. అంజనీదేవికి పుట్టినవాడు. వాయు కుమారుడని పేరు పొందినవాడు. అంజనీ కేసరి దంపతులకు శివుని

తేజస్సు వాయువుద్వారా అంజనీదేవి గర్భములో ప్రవేశించి హనుమ ఉద్భవించాడు. అందుకే ఆ స్వామిని ఆంజనేయ అంటారు. అంజనీదేవి తనయుడు ఆంజనేయుడు.

మహావీర విక్రమ బజరంగీ ।
కుమతి నివార సుమతి కే సంగీ ॥

హనుమ మహావీరుడు. విక్రమము కలవాడు. వజ్రము వంటి రంగు కలవాడు. వీరము విక్రమము కలవాడు. వజ్రము వంటి గట్టి దేహము కలవాడు. సత్సంగము ద్వారా చెడుబుద్ధిని పోగొట్టి, మంచిబుద్ధిని కలిగించే వాడు.

4. కంచన వరన విరాజ సువేశా ।
కానన కుండల కుంచిత కేశా ॥

బంగారు రంగుతో విరాజిల్లువాడు. మంచి వేషము ధరించిన వాడు. చెవులకు కుండలములు, వంకీలుతిరిగిన కేశములు కలిగినవాడు.

5. హాథ వజ్ర అరుధ్వజా విరాజై ।
కాంథే మూంజ జనేవూ ఛాజై ॥

వజ్రాయుధము వంటి చేయిగలిగి, ధ్వజమును చేతితో పట్టిన వాడు. భుజముపై ముంజ గడ్డితో చేసిన జంధ్యమును ధరించినవాడు.

6. శంకర సువన కేసరీ నందన ।
తేజ ప్రతాప మహాజగ వందన ॥

శంకరాంశతో జన్మించిన కేసరి యొక్క పుత్రుడు. మహా తేజస్సు ప్రతాపములు కలిగి, జగత్తులో అందరిచే వందనములు స్వీకరించేవాడు.

7. విద్యావాన గుణీ అతిచాతుర ।
రామకాజ కరివేకో ఆతుర ॥

సర్వ విద్యలలో కోవిదుడు. సర్వ సద్గుణ సంపన్నుడు. అతి చాతుర్యము కలవాడు. దూతకు కావలసిన చాతుర్యముకలవాడు కనుక సుగ్రీవుడు, రాముడు అందరూ మన హనుమనే దూతగా ఎంచుకొని కార్యసిద్ధిని పొందారు. రాముని కార్యము నెరవేర్చుటలో ఆతురత కలిగినవాడు. సీతాన్వేషణ కార్యము పూర్తి అయ్యేవరకు మధ్యలో ఎక్కడా విశ్రమించని వాడు.

- సశేషం

(గత సంచిక తరువాయి) **యోగవాశిష్ఠము** - సుషుమ్నా ప్రసాద

నీవెందుకు శబ్ధ, సుర్శ, రూప, రస, గంధములపై, పరుగిడుతావు? ఈ వాసనలన్నీ వొక వలలా నిన్ను బంధిస్తున్నాయి. ఓ బుద్ధి లేని మనసా? శబ్ధ ప్రలోభమునకు లోనైన లేడిలా, స్ఫర్శ ప్రలోభమునకు లోనైన మగ ఏనుగులా, రూప ప్రలోభమునకు బానిసైన మిడతలా, రుచి ప్రలోభమునకు లోనైన చేపలా, వాసనా ప్రలోభమునకు లొంగిపోయిన తుమ్మెదలా నీవు నశించిపోవద్దు. ఇవన్నీ వొక ప్రలోభమునకు లోనైన జీవులు, కాని మనసున్న మానవుడైదు ప్రలోభములకు లోనై ఎక్కువ ప్రమాదమునకు గురౌతున్నాడు. పంచ జ్ఞానేంద్రియ ప్రలోభములకు, వొక్కుమ్మడి గురైన నీవు, అత్యున్నతమైన నిత్యశాంతి నెలాపొందగలవు?



నిజంగా నీదెంత దురవస్థ? సాలె పురుగు తాను తయారు చేసిన గూటిలో తాను బంధింపబడ్డట్లు, నీవు కోరికలనే వలయంలో బంధింపబడ్డావు. అన్ని కోరికల నుండి స్వేచ్ఛను పొందు. అప్పడు నీవు బంధము నుండి, విముక్తుడవుతావు.

నేను నా శరీరాన్ని ఆపాదమస్తకము అణువణువూ, ప్రత్యేకంగా, విడివిడిగా పరిశీలించాను, కాని యే భాగంలో యే అణువులో కూడ నాకు 'నేను' గోచరించలేదు. ఈ విశ్వం మొత్తం బ్రహ్మము లేక పరమాత్మతో నిండి వున్నది. దానికి రూపములేదు, నామము లేదు, అది వర్ణరహితము, గుణరహితము, అది పొట్టీ కాదు, పొడుగు కాదు, ఇది చిన్నది కాదు, పెద్దదికాదు, నేనే సర్వవ్యాపకమైన పరమాత్మను.

"ఓ మనసా, నీవనేక రకమైన విభేదాలను హెచ్చుతగ్గులను సృజించావు, అన్ని బాధలకు, కష్టాలకు, దుఃఖాలకు, సమస్యలకు నీవే కరాణము. నా వివేచనా శక్తి వలన యిప్పడే నిన్ను ధ్వంసము చేసి, 'నేనెవరు' యని ఆత్మ విచారణ చేస్తాను.

'నేను' అనేది యేవిధంగా శరీరానికి, మనసుకు, ప్రాణానికి, లేక జ్ఞానేంద్రియముల కెలా అన్వయిస్తుంది. 'నేను' అనేది మాంసము, ఎముకలు లేక కళ్ళు, ముక్కు, చెవులు, జిహ్వలతో నిర్మితమైన యీ శరీరమునకెలా అన్వయిస్తుంది? "నేను" అనేది సర్వ వ్యాపకము, నిత్యము, అవిభాజ్యము, స్వయంప్రకాశమైనది, నేను నీ చేత మోసగింపబడుతూనే వున్నాను. 'ఆత్మ' యనే అమూల్య రత్నాన్ని, నీవు నా వద్ద నుండి దోపిడి చేస్తున్న దొంగవు, నేనింక నిన్నే మాత్రము నమ్మను నాకు నీతో శరీరంతో యెలాంటి అనుబంధము లేదు. నీతో, యీ శరీరంతో, శబ్ధ, స్పర్శ, రూప, రస, గంధములతో కలయిక కేవలము తాత్కాలికమైనది.

"ఓ మనసా, నీ సొంత యింటికి తిరిగిపో 'భౌతికమైన కోరికలనే అరణ్యములో విహరించవద్దు తెలివి తెచ్చుకొని, తిరిగి రాకుండా శాశ్వతముగా వుండే నిత్యానంద సుధను చేరుకో".

నేనిప్పుడు ప్రశాంతంగా వున్నాను నా హృదయం సంపూర్తిగా ఆనందమయి వున్నది, మనసు, శరీరము, యింద్రియాకర్షణ యనే బంధాలనుండి విడిబడ్డాను, అన్నిటిలోని యేకత్వమును, నేను దర్శిస్తున్నాను. నేను భయరహితుడను, సర్వమూ నేనే. నాలోని సమస్తమున్నది, అన్ని కాలములలో, సర్వే సర్వత్రా 'నేను' మాత్రమే వున్నాను. నాకు సమతుల్యమైన, నిష్పక్షపాత్రమైన దృష్టివున్నది, నా ఆత్మ యొక్కటై భవాన్ని నేననుభవిస్తున్నాను. నేను నాలో సంతృప్తిగా వున్నాను, నా ఆత్మలో నేనాందిస్తున్నాను.

అప్పడు, ఉద్ధాలకుడు అర్థనిమీలత నేత్రాలతో, పద్మాసనాశీనుడై, తదేక దృష్టితో ధ్యానము చేయటము ప్రారంభించాడు. అతను ఉచ్ఛ స్వరంతో ప్రణవనాదాన్ని లయబద్ధంగా పూరిస్తే, ఆ ప్రణవ నాదము గంట మ్రోగినట్లు, ఆప్రదేశమంతా ప్రతి ధ్వనించింది. ప్రణవము (ఓం) మూడున్నర మాత్రలతో కూడియున్నది, అకార, ఉకార, మకారములు కలిసి ఓంకార మవుతుంది.

- సశేషం

# శ్రీ మహాభారత నీతి చంద్రిక

(గత సంచిక తరువాయి) **మాతృదేవో భవ** - శ్రీ రామానుజ దాసు

దేవేంద్రుడు గరుత్మంతుని పరాక్రమమునకు విస్మయం చెందాడు. ఇంత పరాక్రమం కలిగిన గరుడునితో స్నేహం కలుపుకోవాలని అనిపించింది. 'మరణం, ముసలితనం, పరాజయం లేని నీకు అమృతం ఎందుకు? ఈ అమృతాన్ని ఇతరులకు ఇస్తే, వారు దేవతలు కూడా జయించలేని వారవుతారు. అమృతాన్ని ఇతరులకు యివ్వద్దు. దాన్ని నాకు తిరిగి యిచ్చివేస్తే నేను నీకు యిష్టమైన దాన్ని యిస్తాను' అన్నాడు. గరుడు సమాధనంగా 'నేను నా తల్లి దాస్య విముక్తి నిమిత్తం అమృతం యిస్తానని సర్పాలతో చెప్పాను. ఈ అమృతం సర్పాలకు యిచ్చి నా తల్లి దాస్యం పోగొట్టుకుంటాను. తరువాత ఆ సర్పాలు దానిని త్రాగక మునుపే నీవు దీనిని తీసుకుపోవచ్చు' అని చెప్పాడు. గరుడుని మాతృభక్తి ఇంద్రుడు మెచ్చి, వరం కోరుకోమనగా తనకు సర్పాలు ఆహారంగా కావాలన్నాడు.

అమృతం తెచ్చి దర్భలపై పెట్టి సర్పాలకు ఆ పాత్రను చూపి 'దేవేంద్రుని చేత రక్షింపబడుతున్న అమృతం తెచ్చాను. సూర్యుడు, గాలి, అగ్ని, చంద్రుల సాక్షిగా నా తల్లి దాస్యం పోయింది. స్నానం చేసి, శుచిగా అమృత పానం చేయండి' అని చెప్పి, తన తల్లియైన వినతను తన వీపు మీద ఎక్కించుకుని వెళ్లిపోయాడు గరుత్మంతుడు.

సర్పాలు అటు స్నానానికి వెళ్ళగానే ఇంద్రుడు వచ్చి అమృతాన్ని తీసుకుపోయాడు. స్నానానికి వెళ్లివచ్చిన సర్పాలు అమృతం పెట్టిన ప్రదేశానికి వచ్చి, అక్కడ అమృతం లేపోవటంతో, దర్భలపై పడిన బిందువులైనా త్రాగవచ్చు కదా అనే ఆశతో నాలుకతో దర్భలు నాకగా వాటి అంచులు పదునుగా ఉండటం వల్ల నాలుకలు రెండుగా చీలాయి. అప్పటి నుండి పాములు రెండు నాలుకలు కలిగినవిగా అయ్యాయి.

తల్లి దాస్య విముక్తికై ఎన్నో కష్టాలుకు ఓర్చి దేవేంద్రుని లోకంలోని అమృతాన్ని తెచ్చియిచ్చిన గరుడుడు మాతృసేవా నిరతులైన పుత్రులందరికీ ఆదర్శం. మాతృసేవలో తరించిన వారిని మాధవసేవకు పరమాత్ముడు తనకు తానుగా ఎన్నుకుంటాడనేది ఈ కథ ద్వారా మనకు తెలుస్తుంది.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

మార్చి 2016

4 శుక్ర : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

7 సోమ : మహాశివరాత్రి, తె.జా 3-30ని॥లకు శ్రీబాబుకు అభిషేకం; 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ; ఉదయం 8గం.లకు శ్రీరామలింగేశ్వర స్వామికి సామూహిక ఏకాదశరుద్రాభిషేకాలు; 11గం.లకు పంచామృతాలు, నవరసాలు, సహస్రఘటాభిషేకం, లక్షబిల్వార్చన; అనంతరం భక్తసమారాధన; రాత్రి 7గం. శ్రీఉమారామలింగేశ్వర లీలా సామూహిక కళ్యాణమహోత్సవం; అనంతరం స్వామినగరోత్సవం.

9 బుధ : అమావాస్య, సూర్యగ్రహణం

11 శుక్ర : లలితానంద సరస్వతిస్వామిని ఆరాధన; శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం

23 బుధ : ఫాల్గుణ పూర్ణిమ, హోలీ పండుగ; శ్రీసద్గురుపాదపూజ

ఏప్రియల్ 2016

02 శని : శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

06 బుధ : మాస శివరాత్రి., పావులూరు శాఖలో ఏకాహం

07 గురు : అమావాస్య

08 శుక్ర : శ్రీ దుర్ముఖి నామ సంవత్సర ఉగాది ; ఉదయం 11గం.లకు పంచాంగ శ్రవణం; శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

08 శుక్రవారం నుండి 14 గురువారం వరకు మౌన ధ్యాన సప్తాహం

15 శుక్ర శ్రీ రామ నవమి; ఉదయం 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ, 11గం.లకు శ్రీసీతారాముల సామూహిక కళ్యాణాలు, భక్తసమారాధన.

22 శుక్ర : చైత్ర పౌర్ణమి, శ్రీసద్గురుపాదపూజ.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

'మానవుడు మరణం లేకుండా చేసుకునే మార్గం లేదా?' అన్న ప్రశ్నకు సమాధానంగా శ్రీగురుదేవులు మాట్లాడుతూ "మరణాన్ని జయించటం అసంభవం. జన్మించిన ప్రతిజీవుడూ మరణించవలసినదే. అయితే జననం లేకుండా చేసుకోగలిగితే ఇహ మరణం ఉండదు కదా! మరణం కూడా శాశ్వతం కాదు. అది కాలానికి లోబడి ఉంటుంది. జీవుడు తాను ఆశ్రయించి వున్న ఉపాధి వదలగానే వేరొక ఉపాధిని వెతుక్కుని దానిలోకి ప్రవేశిస్తాడు. ఒక ఉపాధిని విడిచి వేరొక ఉపాధికి మారే సమయమే మరణము.



మరణమంటే ఇంద్రియాలు దేహమునకు ప్రపంచముతో ఉన్న సంబంధం తెగిపోవటన్నమాట. జీవుడు ఏ ఉపాధిని చేరేది నిర్ణయించుకో వలసినది తానే. జీవుడు తన కర్మఫలాన్ని అనుసరించి, అతనిలో వాసనగా మిగిలి ఉన్న కోరికల సమిష్టి ఫలమే తాను ఆశ్రయించే ఉపాధి. ఇందులో భగవంతుని ప్రమేయమేమున్నది? భగవంతుడు కేవలం జీవుని కోర్కె తీర్చటానికి సాక్షిగా నిలబడతాడు. మరి మరణాన్ని జయించే ఉపాయం లేదా? అంటే ఉంది.

బిడ్డ జన్మించిగానే తల్లిదండ్రులు ఆ బిడ్డ భవిష్యత్ గురించి ఎన్నో కలలు కంటారు. ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. దానిని సాధించటానికి ఎంతో శ్రమిస్తారు. అంతేకాని అసలు మానవుని భవిష్యత్తు ఏమిటి? అన్నది ఆలోచించేది ఎంతమంది?

జీవుడు తన మానవజన్మ ధ్యేయం ఏమిటో తెలుసుకోవాలి కదా! సృష్టి ధ్యేయం ఏమిటన్నది కూడా మనకు అవగాహనకు రావాలి. ఇన్ని వివరాలు తెలుసుకోవాలంటే ఒక గైడ్ కావాలి. ఆయనే సద్గురుమూర్తి. ఆయనని ఆశ్రయించాలనే భావన కలగటం చాలా దుర్లభం. అది జన్మ

జన్మల నుంచి ఆర్జించిన పుణ్య ఫలం రాశీభూతమైతే గాని సద్గురుమూర్తి సమాశ్రయం లభించటం కష్టం.

నిరాలమ్బోపనిషత్ దానినే వివరిస్తోంది. 'క ఉపాస్యః?' ఎవరిని ఉపాసించాలి. ఆ ప్రశ్నకి సమాధానంగా 'సర్వ శరీరస్థ చైతన్య ప్రాపకో గురురుపాస్యః' అని. అంటే దేహేంద్రియాలకు, మనస్సుకి బుద్ధికి ఆధారమైన చైతన్యము లేక ఆత్మగా ప్రకాశించే సద్గురుమూర్తిని ఉపాసన చేయాలని వివరిస్తోంది.

రూపనామ క్రియా రహితమైన, సర్వవ్యాపకమైన సర్వజీవుల ఉనికికి ఆధారమైన తేజస్సు లేక శక్తియే గురుశక్తి. ఆ శక్తి జీవోద్ధారణకై ఒక రూపధారణ చేసి, సద్గురుమూర్తిగా ఆవిర్భవించి, మానవుల జీవిత ధ్యేయమేమిటో తెలియజేయగల సమర్థులు. సాగర ప్రయాణంలో తెప్పకుతెడ్డు ఎలా తోడ్పడుతుందో సంసార సాగరంలో మునిగి యున్న మానవునికి సద్గురుమూర్తి సత్-చిత్ ఆనందాన్ని అనుభవించే సాధనా మార్గాన్ని అందజేస్తారు. నిత్యానిత్య వస్తు వివేకాన్ని ప్రేరణ చేస్తారు. జగత్తు నిత్యమనే భ్రమిని తొలగిస్తారు. భ్రమ తొలగితే భ్రాంతి ఉండదు కదా!" అన్నారు సద్గురుదేవులు.



# గృహస్థుని ధర్మములు

-సేకరణ మురళి

(వార్తాలాపం నుండి)

పూర్వం ఒక రాజు ఉండేవాడు. తన రాజ్యంలోకి వచ్చిన ప్రతి సన్న్యాసిని గృహస్థాశ్రమం గొప్పదా? సన్న్యాసాశ్రమం గొప్పదా? అని అడిగే వాడు. 'గృహస్థాశ్రమం గొప్పది' అని ఎవరైనా సన్న్యాసి చెబితే, బలవంతంగా అతనికి కాషాయాంబరాలు విప్పించి, పెళ్ళి చేయించి, జీవితం గడుపు కోవటానికి అవసరమైన సదుపాయాలు చేసేవాడు.

'సన్న్యాసాశ్రమం గొప్పది' అని ఎవరైనా చెబితే, దానికి ప్రమాణం ఏమిటని అడిగేవాడు. సరియైన సమాధానం ఇవ్వలేకపోతే ఆ సన్న్యాసికి కూడా బలవంతంగా పెళ్ళి చేయించి, జీవనోపాధికి ఏర్పాటు చేసేవాడు.

ఇలా కొంతకాలం గడిచాక, ఒక రోజు ఒక సన్న్యాసి అక్కడికి వచ్చాడు. అతనిని కూడా రాజు అదేవిధంగా ప్రశ్నించాడు. 'యదార్థంగా పాటిస్తే రెండూ గొప్పవే' అని అతను సమాధానం చెప్పాడు. రాజు 'ప్రమాణం ఏమిటి?' అని తిరిగి ప్రశ్నించాడు. 'దీనిని ప్రత్యక్షంగా చూడదలిస్తే నాతో రండి చూపిస్తాను' అని సమాధానం చెప్పాడు. రాజు అంగీకరించి, ఆ సన్న్యాసిని అనుసరించాడు.

వారిద్దరూ చాలా దూరం నడిచి, పొరుగు రాజ్యం చేరారు. ఆ రాజ్యంలో రాజు చనిపోయాడు. వానికి కుమారుడు లేడు. ఒక కుమార్తె మాత్రమే ఉంది. ఆ రాజు చనిపోయే సమయంలో ' మా పట్టపుటేనుగు ఎవరిపై ఉదక కుంభాన్ని అభిషేక్తిస్తుందో అతనికి, నా కన్యను, నా రాజ్యాన్ని ఇస్తున్నాను' అని చెప్పి చాటింపు వేయించాడు. మంత్రి దాన్ని అమలు పరిచాడు. ఒక సుముహూర్తం నిర్ణయింప బడినది. చాలా మంది రాజ కుమారులు వచ్చారు. కాని ఏనుగు ఒక యువ సన్న్యాసిపై ఉదక కుంభమును అభిషేకించింది.

సన్న్యాసి ఒక్క మారు వెనుకకు తగ్గాడు. అతన్ని ఆపి రాజకన్య, మంత్రి కూడా నచ్చచెప్పటానికి ప్రయత్నించారు. 'తమరు వివాహం

చేసుకుని, ఇక్కడే ఉండి, నివృత్తి మార్గం అనుసరించండి. రాజ్య భారం అంతా మేమే చూసుకుంటాము. మీకు ఏ విధమైన బంధన వుండదు' అని ఎంతగా నచ్చచెప్పినా, ఆ సన్యాసి అంగీకరించకుండా అక్కడి నుండి వెళ్ళిపోయాడు. ఇదంతా మన రాజు, సన్యాసి ఒక చెట్టు చాటున కూర్చుని గమనిస్తూనే ఉన్నారు. వారు కూడా ఆ సన్యాసిని వెంబడించారు.

ఇంతలో చీకటి పడింది. ఈ ముగ్గురు కలిసి ఒక చెట్టు క్రింద కూర్చున్నారు. శిశిర ఋతువు అయినందున చలిబాగా వేస్తోంది. ఆ చెట్టు మీద ఒక పక్షి కుటుంబం నివశిస్తోంది. అవి తమ సమీపంలో ఈ ముగ్గురు మనుష్యులు చలికి బాధపడటం చూశాయి.

ఆ పక్షులు అరణ్యంలో నుండి ఎండు పుల్లలు తెచ్చి, నిప్పు ముట్టించాయి. ఈ ముగ్గురు ఆ భగవంతుడు సహాయం చేసినట్లుగా భావించి, ప్రక్కనున్న ఎండు పుల్లలను కూడా ఏరుకుని చలి కాచుకున్నారు.

అతిథులకు క్షుద్బాధ తీర్చాలనే తలంపుతో మగపక్షి నిప్పులో పడింది. భర్త శరీరంతో వారి ఆకలితీరదనే ఆలోచనతో ఆడపక్షి కూడా ఆ నిప్పులో దూకింది. పిల్ల పక్షులు కూడా తమ తల్లిదండ్రులను అనుసరించాయి.

ఇది చూసి సన్యాసి రాజుతో "సరిగా నిర్వహించినచో రెండు మార్గాలు శ్రేష్ఠమనవే. తటస్థుడగు సన్యాసి రాజ కన్యను, రాజ్యాని కూడా తృణప్రాయంగా త్యజించి తన సన్యాసాశ్రమ ధర్మాన్ని చక్కగా పాలించాడు. అలాగే చెట్టుపైన ఉన్న పక్షి కుటుంబం అతిథి సత్కార్యాన్ని చేయటానికి ఉత్తమమైన త్యాగాన్ని చేసి, గృహస్థాశ్రమ ధర్మాన్ని చక్కాగా నెరవేర్చాయి. కాబట్టి ఓరాజా! ఏ మార్గమైనా చక్కగా నిర్వహిస్తే అవి రెండూ శ్రేష్ఠమైనవే' అని చెప్పాడు.

# ఎంత సుందరమయ్యా నీ వదనం

- పెనుమాక నాగేశ్వరరావు

ఎంత సుందరమయ్యా నీ వదనం
పొద్దే చాలదు ఎంతసేపు కన్నా ....ఎంత సుందరమయ్యా!
ఎం చిత్రమోగద చిత్తర్వులమౌదుము మిము చూసినంత

ఎంత కమనీయమయ్యా నీ వచనం
విసుగే కలుగదు ఎంతసేపు విన్నా........ ఎంత కమనీయమయ్యా!
ఏమి మంత్రమో మరి మంత్రముగ్ధులమౌదుము మీ చెంతా

ఎంత మధురమయ్యా నీ నామము
అలుపే ఎరుగము ఎంతసేపు అన్నా ...... ఎంత మధురమయ్యా!
ఏమి మాయయో అది వెగటే వుండదు ఇసుమంతా

ఎంత మహిమాన్వితమో నీ ధామము
తనివే తీరదు ఎంతసేపు వున్నా ........ఎంత మహిమాన్వితమయ్యా!
ఏమి సూత్రమో మరి బంధించెనది భక్తితో మమ్మంతా



# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

ద్వితీయాశ్వాసము 6వ శ్లో॥

మాన్దం మన్దం మధుర నినదైర్వేణు మాపూర యన్తమ్
బృన్దం బృన్దావన భువి గవాం చారయన్తం చరన్తమ్
ఛన్దోభాగే శతమఖ మఖధ్వంసినా దానవానామ్
హన్తారం తం కథయ రసనే! గోపకన్యా భుజఙ్గమ్

తాత్పర్యము -



ఓ నాలుకా! తీయని మ్రోతలచే మెల్లి మెల్లిగా పిల్లన గ్రోవిని పూరించుచున్న వాడును, తులసి తోటలయందు ఆవులమందలను త్రిప్పుచున్న వాడును, వేదవాక్కులయందు వెలుగుచున్న వాడును, దేవేంద్రుని యాగమును పాడుచేసిన రాక్షసులను సంహరించువాడును, గోపికా జారుడైన శ్రీకృష్ణుని పొగడుమా!

సత్యలోకంలో చదువుల తల్లి సరస్వతీదేవి చెంత దేవగణాలకి చెందిన పలువురు విద్యాభ్యాసం చేస్తుండేవారు. అందులో కిన్నెర అనే కన్య, కిం పురుషుడనే యువకుడు విద్యలో గొప్ప అభివృద్ధిని సాధించి, 'అమ్మ' ప్రేమానురాగాలకి పాత్రులయ్యారు. తల్లికి అందరూ సమానమే! అయినా వారిని ప్రోత్సహించటానికి రవ్వంత అభిమానం చూపిస్తుండే సరికి, వారిలో తామే అందరికన్న విద్యాధికులమన్న గర్వపు మొలక అంకురించి, సాటివారిని కించపరిచే విధంగా వారు ప్రవర్తించటం తల్లి గమనించింది. ఎలాగైనా వారికి గుణపాఠం చెప్పాలనుకుంది. ఆ తరుణం రానే వచ్చింది.

ఒకనాడు ఆమె పెనిమిటి పరమేష్ఠి, పత్నితో ముచ్చటలాడుతూ 'నేను సృష్టికర్తననే అహంకారంతో బృందావనగోపాలబాలుని పట్ల అవిధేయుడై ప్రవర్తించి, వానిని మోసం చేయబోయి, నేనే మోసంలో పడ్డాను. ఆ చిన్నిబాలుని చేతిలో చిత్తుగా ఓడిపోయి, వానిని శరణు వేడక తప్పలేదు. పెద్ద మనస్సుతో నా తప్పు మన్నించిన ఉదార హృదయుని నేను ఎంతని వర్ణించను దేవీ!' అన్న పతిమాటలు వింటూ ఆలోచనలో

పడిన వాణికి ఒక దారి దొరికింది. వెంటనే కిన్నెర, కింపురుషలను పిలిపించింది. వారితో 'నేను మీకిద్దరికీ నేర్పదలచుకున్న విద్యలన్నీ కూలంకుషంగా నేర్పాను. ఆ విద్యలలో నిష్ణాతులైనట్లుగా నేను పెట్టే పరీక్షలో నెగ్గి మీరు నిరూపించుకోవాలి' అన్నది. 'అదేమిటో సెలవివ్వండి తల్లీ!' అన్నారు వాళ్ళు ఉత్సాహంగా.

'భూలోకంలో బృందావనంలో ఒక గోపబాలుడు గోవులను మేపుకుంటూ తిరుగుతూ ఉంటాడు. అతను 'వేణుగాన కళావిశారుదుడు' అన్న పేరెన్నిక గలవాడు. మీరిద్దరూ వాని దగ్గరకు వెళ్ళి, మీరు నా వద్ద నేర్చుకున్న గానకళా విద్య ప్రావీణ్యతను ప్రదర్శించి, వానితో పోటీ చేసి, గెలిచి రావాలి' అన్నది. 'ఓస్! అదెంత పని!' అంటూ ముందుకు దూకారు ఇద్దరూ. ఆ చదువుల తల్లి నవ్వుకున్నది మనస్సులో.

మరోక్షణానికి వారిద్దరూ బృందావనంలో ఉన్నారు. ఎంతో అందమైన ప్రకృతిలో ఆలమందలను కాచుకుంటూ మధురాతి మధురంగా వేణువుని మ్రోగిస్తున్న గోపబాలుడు కనిపించాడు వారికి. స్వామిని చూడగానే వాని చెంతకుచేరి నమస్కరించి, తాము వచ్చిన పని విన్నవించుకున్నారు. 'నాకేం అభ్యంతరం లేదు. కొద్ది క్షణాలలోనే పోటీ మొదలు పెడదాం. మీరు అమ్మకి నమస్కరించుకుని ధీరులై నిలబడండి' అన్నాడు కన్నయ్య.

వెంటనే చేతిలోని వేణువును తీసుకుని ఎర్రని పెదిమలకు ఆన్చి మ్రోగించటం మొదలు పెట్టాడు. ఆ గానం వింటూనే దూరదూరాల నుండి గోవులు, గోపబాలురు, గోపికలు అంతా పరుగులెత్తి వచ్చి, వాని చుట్టూ వలయాకారంగా నిలబడ్డారు. వేణుగానికి అనుగుణంగా నాట్యం చేశారు, పాడారు, శృతికలిపి గానం చేశారు. అంతా ఆ చోటు అంతా నిండిపోయారు.

మెల్ల మెల్లగా మధురాతి మధురంగా నందబాలుడు మ్రోగించే వేణువులోని ప్రణవ నాదం విశ్వమంతా వ్యాపించింది. ఆ గానం సకల జన సమ్మోహనంగా ఉంది. అంతలో చటుక్కున మురళీమోహనుడు వేణువును ఊదటం ఆపేశాడు. ఎక్కడివారక్కడే కదలకమెదలక చిత్ర కారుడు గీసిన చిత్తరువులా నిలచిపోయారు! ప్రకృతి అంతా స్థంబించి పోయింది!

-సశేషం

# సమర్థ సద్గురు

[యాజమాన్యం తదితర వివరాలు]

FORM - 4 ( 8వ నిబంధన ప్రకారము)

| | |
|---|---|
| ప్రచురణ స్థలం | - శ్రీ కాశీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - సి.వి. రమణబాబు |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - డి.జె.బి.కె. లాల్. |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఛారిటబుల్ ట్రస్ట్ D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియచేస్తున్నాము.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) సి.వి. రమణబాబు

ది. 1-3-2016

పబ్లిషర్

# రాజయోగము

(వార్తాలాపము నుండి)

సేకరణ - మురళీ

ఒక బ్రాహ్మణ కుమారుడు సంసారంలో అనేక యిబ్బందులు ఉన్నాయని, జ్ఞాన సముపార్జనకు సన్న్యాసమే ఉత్తమమని ఆలోచించి, సన్న్యాస దీక్ష తీసుకోవటానికి మంచి సన్న్యాసి కోసం అన్వేషించసాగాడు. అప్పుడతనికి 'ఫలానా గ్రామంలో జ్ఞానమఠం ఉంది. అందులో మహా విద్వాంసుడగు సన్న్యాసి ఒకాయన ఉన్నారు. వాని వద్దకు వెళ్ళు' అని ఒకడు సలహా చెప్పాడు. వెంటనే అక్కడకు వెళ్ళి ఆయనకు నమస్కారం చేసి కూర్చున్నాడు.

స్వామివారు ఎంతో ప్రేమతో "నివెవరవు? ఎందుకు వచ్చావు?" అని అడిగారు. దానికి వినయంగా "నేను బ్రాహ్మణ కుమారుడను. సన్న్యాస దీక్ష తీసుకోవటానికి మీ సన్నిధికి వచ్చాను" అని సమాధానం చెప్పాడు. వెంటనే స్వాములవారు "సన్న్యాస దీక్ష అంటే అంత తేలిక కాదు. నాలుగు లేదా ఐదు మాసాలు ఇక్కడే ఉండు. నీకు పూర్ణ వైరాగ్యం కలిగిందిని తోచినప్పుడు దీక్ష ఇస్తాను" అని చెప్పారు.

కొన్ని రోజుల తరువాత స్వాములవారు తమ మఠంలోని వ్యక్తులను అతనికి పరిచయం చేస్తూ ".......ఈయన మా చిన్న గురువు గారు, ........ఇతడు నా సతీర్థుడు, .........ఇతడు నా శిష్యుడు" అని చెప్పారు. తరువాత విశాలమైన మఠంలోని ప్రతి భాగాన్ని వివరిస్తూ చూపించాడు. ....... ఇది గోష్ఠి మందిరం, .... ఇది సామానుల గది, ......... ఇది భోజనశాల, .... ఇది అతిథి గృహము, ....ఇది పడక గది, ...... ఇది ధాన్యాగారము, ...ఇది ధనాగారము. .....అదిగో అటు చూడు! పశువుల శాలలో అశ్వములు, రథములు, ఆవులు, గేదెలు అన్నీ ఉన్నాయి.

ఏ లోపమూ లేదు. ఈ మఠానికి తోడు 5, 6 శాఖలు ఉన్నాయి. ఆ యా నగరాలలో దుకాణాలు ఉన్నాయి. వాటికి అద్దె చాలా వస్తుంది. అనేకమంది మహారాజులు, ధనవంతులు యీ మఠానికి సేవకులు. ఆ శ్రీమంతులు చాలా భూమిని మఠానికి జాగీరుగా యిచ్చారు" అంటూ

ఇలా ఇంకా మిగిలిన ఆస్తులను కూడా వివరంగా చెప్పారు.

కానీ ఆ వెర్రి బాగుల పిల్లవాడు శ్రీమంతుల బిడ్డ. పై వాటివలన వానికేమాత్రము ఆకర్షణ కలుగలేదు. అంతేకాడు అవన్నీ వినిన తరువాత అతనికి ఒక ఆలోచన కలిగింది. "ఇల్లు, వాకిలి మొదలగు ఉపాధులు విడిచి ఇక్కడకు వచ్చాను. కాని అక్కడ పదిరెట్లు ఎక్కువ ఉపాధి కనిపిస్తోంది. ఈ జ్ఞాన మఠంలో ఉండి జ్ఞానాన్ని పొందటానికి బదులు అజ్ఞానంలో చిక్కుకుంటాను. ఇది మంగలములో నుండి పొయ్యిలో పడినట్లు అవుతుంది. ఇంతకంటె నా ఇల్లే మంచిది" అని ఈ విధంగా ఆలోచించి అతడు జ్ఞానమఠాన్ని విడిచి వెళ్ళిపోయాడు. ఇల్లువాకిలి వదిలి వచ్చినవాడికి మఠం ఎట్లా రుచిస్తుంది?

(శ్రీ బాబూజీ మహరాజ్‌వారు కూడా ఎక్కువగా రాజయోగమునే బోధించేవారు)

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

మార్చి 2016

4 శుక్ర- శ్రీగురుదశమి; రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ

7 సోమ- మహాశివరాత్రి ఉ. 5గం.లకు అభిషేకం;
రాత్రి7గం. శ్రీసద్గురు పాదపూజ.

23 బుధ- పూర్ణిమ; హోలీపండుగ- రాత్రి7గం. శ్రీసద్గురుపాదపూజ

ఏప్రిల్ 2016

2 శని- శ్రీగురుదశమి - రాత్రి7గం. శ్రీసద్గురుపాదపూజ

8 శుక్ర- దుర్ముఖినామ సంవత్సరాది; ఉ. 11గం. శ్రీసద్గురుపాదపూజ

15 శుక్ర- శ్రీరామనవమి; ఉ. 5గం. శ్రీసద్గురుపాదపూజ; 11గం.లకు శ్రీసీతారాముల కళ్యాణం; పానకం వితరణ.

22 శుక్ర- పూర్ణిమ; రాత్రి7గం. శ్రీసద్గురుపాదపూజ

(గత సంచిక తరువాయి)

# గీతాధ్యయనమ్

- రమణ ప్రసాద్

## భక్తియోగము

విశ్వరూప సందర్శనం చేసిన అర్జునునికి పూర్వం భగవంతుడు తెల్పిన అక్షర నిరాకార ఆత్మోపాసన మనస్సులో మెదిలాయి.



అప్పుడు సాకారోపాసన సంబంధములైన వాక్యాలను విని అర్జునునకు సంశయం కలిగి సాకారా నిరాకారోపాసకులలో ఎవరు శ్రేష్ఠులు? అని,

ఏవం సతతయుక్తాయే భక్తాస్త్వాం పర్యుపాసతే
యేచాప్యక్షర మవ్యక్తం తేషాంకే యోగవిత్తమాః 1

ఎల్లప్పుడూ నీ యందే మనస్సు నిలిపి యే భక్తులు నిన్ను ఉపాసిస్తున్నారో; ఎవరు ఇంద్రియ గోచరంగాని పరబ్రహ్మమును ధ్యానిస్తున్నారో; వీరిలో ఎవరు యోగ విత్తములు? అనగా, భగవానుడు 'అర్జునా! నా యందు మనస్సు నిలిపి దైవచింతన కలవారై, నన్ను ఉపాసించేవారు ఉత్తమ యోగులు. ఎవరు ఇంద్రియములను నిగ్రహించి, సమభావం కలవారై, సమస్త ప్రాణులకు హితముచేయువారై, ఇట్టిదని చెప్పవీలుగానిది, ఇంద్రియ గోచరం కానిది, చింతింప అలవికానిది, నిర్వికారమైనది, నిత్యమైనది అయిన పరబ్రహ్మ మును ధ్యానించేవారు నన్నే పొందుతారు. కాని అవ్యక్త (నిర్గుణ) పరబ్రహ్మమునందు ఆసక్తి కలవానికి ప్రయాస చాలా అధికము. ఎందుకనగా నిర్గుణోపాసనా మార్గము దేహాభిమానం కలవానికి అతి కష్టతరము.

యేతు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః ।
అనన్యే నైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే ॥ 6
తేషామహం సముద్ధర్తా మృత్యుసంసార సాగరాత్ ।
భవామి నచిరాత్పార్థా! మయ్యావేశిత చేతసామ్ ॥ 7

'సమస్త కర్మలను నాకే అర్పించి, నన్నే పరమగతిగా భావించి, నన్నే ధ్యానించి, సేవించే భక్తులను మృత్యురూపమైన సంసార సాగరం

నుండి అచిర కాలంలో ఉద్ధరిస్తాను. నా మీదే మనస్సును, బుద్ధిని నిలుపు. అప్పుడు తప్పకుండా నాలోనే నివసిస్తావు. అలా నాపై మనస్సు నిశ్చలంగా నిలుపలేకపోతే, అభ్యాస యోగంతో నన్ను పొందే ప్రయత్నం చెయ్యి. అభ్యాసం చేయలేకపోతే, నా కోసం కర్మలను ఆచరించు. నాకు ప్రీతి కలిగే కర్మలు చేయటం వల్ల నీవు మోక్షం పొందగలవు. అదీ చేయ లేకపోతే, నన్ను ఆశ్రయించి, నీవు చేసే కర్మఫలాన్ని త్యాగం చెయ్యి. అవివేకంతో కూడిన అభ్యాసం కంటె, జ్ఞానం మేలు; జ్ఞానం కన్నా ధ్యానం ఉత్తమమం; ధ్యానం కంటె కర్మఫలత్యాగం మంచిది; త్యాగం వలన మనస్సుకు శాంతి కలుగుతుంది' - అని వివిధ సాధనలు చెప్పి, ఏడు శ్లోకములు ద్వారా (13-19) ఉత్తమ భక్తుని లక్షణములను భగవానుడు చెబుతున్నాడు.

అవి 35 లక్షణాలు - 1. ఏ ప్రాణిని ద్వేషింపరాదు. 2. మైత్రి 3. కరుణ 4.మమత్వం లేకపోవుట 5. అహంకారం లేకుండుట. 6. సుఖదుఃఖాలయందు సమదృష్టి. 7.ఓర్పు 8.సంతుష్టి 9. మనోనిగ్రహం 10.దృఢ నిశ్చయం 11. మనస్సును బుద్ధిని భగవానునికి అర్పించుట 12. తానుగాని, తనవలనగాని భయములేకుండుట 13. హర్షము భయము క్రోధము లేకుండుట. 14. దేనియందు ఆపేక్ష లేకుండుట 15. శుచిత్వం 16. కార్యసామర్థ్యము 17. తటస్థత్వము 18. మనోవ్యాకులత లేకుండుట 19. సర్వకర్మ ఫలత్యాగము 20. హర్షము లేకుండుట 21. ద్వేషము లేకుండుట 22. శోకము లేకుండుట 23. కోరిక లేకుండుట 22. శుభాశుభ పరిత్యాగము 23. శత్రు మిత్రులందు సమత్వం 26. మానవమానముల యందు సమత్వం 27. శీతోష్ణము లయందు సమత్వం 28. సుఖఃదుఖాలయందు సమభావం 29. సంగవర్జితత్వం 30. నిందాస్తుతులయందు సమత్వం 31. మౌనము. 32. దొరికినదానితో తృప్తి 33. గృహాదులయందు ఆసక్తి లేకపోవటం 33. నిందాస్తుతులయందు సమత్వం 34. స్థిర బుద్ధి 35. భగవద్భక్తి. అట్టి భక్తుడు నాకు అత్యంత ప్రియుడు' అన్నాడు. శ్రద్ధతో నన్నే నమ్మి, నే చెప్పిన ధర్మాన్ని పాటించే భక్తులు నాకు పరమ ఇష్టులు.

- సశేషం

# అగస్త్య మహర్షి

- రమణ ప్రసాద్

భరతఖండంలో జన్మించి తపోమహిమ చేత సృష్టి ,స్థితి లయ కారకులైనవారే ఋషులు. పరమ పవిత్ర వర్తనులు. అట్టివారిలో అగస్త్యమహర్షి అగ్రగణ్యుడు. వసిష్ఠ మహర్షికి సహజన్ముడు. ఇంద్రుడు, వరుణుడు ఊర్వసిని మోహించినవారలై లోక సంరక్షణార్థం తమ వీర్యములను ఒక జలకలశములో విడువగా, కాలక్రమంలో ఆ కలశమునుండి అద్భుత తేజస్వులైన  అగస్త్యుడు, వసిష్ఠుడు ఉద్భవించారు. అందువలన వీరికి కుంభ సంభవులని, మైత్రావరుణ పుత్రులని పేరు వచ్చినది.



అగస్త్యుడు బాల్యమునుండియే పరమ నిష్ఠాగరిష్ఠుడై సకల విద్యాపారంగతుడై, దివ్య తేజస్విగా రూపొందాడు. ఒకనాడు అరణ్యంలో తిరుగుతూ వృక్ష శాఖలపైనుండి వ్రేలాడుచుండిన మునీశ్వరులను చూసి,'మీరెవ్వర'ని అడుగగా, 'మేము పితృదేవతలము. నీవు వివాహము చేసికొని, పుత్ర్యలను, పౌత్రులను కని మాకు ఊర్ధ్వలోకాలు ప్రసాదిస్తావని కొండంత ఆశతో ఉన్నామ'ని చెప్పారు. 'మీ కోరికను తప్పకుండా తీరుస్తాను' అని వాగ్దానం చేశాడు.

పిదప విదర్భరాజు కుమార్తె అయిన లోపాముద్రను వివాహం చేసికొన్నాడు. గంగా తీరాన ఒక ఆశ్రమం నిర్మించుకొని నివసిస్తున్నాడు. అగస్త్యుడు లోపాముద్రతో సంగమము కోరగా, ఆమె సమస్తాభరణాలు, నూతన వస్త్రాలు కోరింది. దానికి కావలసిన ధనం కోసం బ్రధ్నశ్వుడు శ్రుతర్వుడు, అను రాజులను అర్థించాడు. వారి దగ్గర సరిపడే ధనం లేనందున వారు మణిమతీపురాధీశుడైన ఇల్వలుడు అనే రాక్షసుని అర్థించాడు. అతని తమ్ముడు వాతాపి. అతడు కామరూపి. అతనిని మేకను చేసి వధించి దానిని  వండి బ్రాహ్మణునకు భోజనం పెట్టి, 'వాతాపీ బయటకు రా' అని పిలువగా వాతాపి అతని పొట్ట చీల్చుకుని

వచ్చేవాడు. ఆ తరువాత వారిరువురూ ఆ బ్రాహ్మణుని వండుకు తినేవారు. ఈ విధంగా వారు చేయటం పరిపాటి అయింది.

ఈ రోజున తమ వద్దకు వచ్చిన అగస్త్యునికి అదేవిధంగా వాతాపిని మేకను చేసి వండి ఆ మాంసాన్ని అగస్త్యుడికి పెట్టించాడు. ఇల్వలుడు తమ్ముని పిలిచేంతలో, అగస్త్యుడు "జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం" అనగానే వాతాపి జీర్ణమైపోయాడు. ఇల్వలుడు చేసేదేమీలేక ఇచ్చిన మాట ప్రకారం అపరిమిత ధనం ఇచ్చి అగస్త్యుని పంపాడు. తరవాత ఇల్వలుని వధించుటచేత అతనికి 'వాతాపీల్వలమర్దనుడ'ను పేరు వచ్చింది. పిదప అతని అనుగ్రహం చేత లోపాముద్ర దృఢస్యుడను కుమారుని కన్నది. అతనికి తేజస్వి అనే కుమారుడు కలిగాడు. ఈ విధంగా అగస్త్యుడు పుత్ర పౌత్రులను కని పితృదేవతలకు పుణ్యలోకగతులను ప్రాప్తింపచేశాడు.

రాజర్షి కవేరునికి తాను వరమీయగా పుట్టిన లోపాముద్ర అంశయైన విష్ణుమాయని వివాహము చేసికొని అతనికి మోక్షము లభించేటట్లు చేయుమని బ్రహ్మదేవుడు అగస్త్యుని కోరగా, అతడు సమ్మతించి కవేర కన్యకను వివాహం చేసుకొన్నాడు. వెంటనే ఆమె నదిగా మారిపోయింది. ఆనదియే కావేరినది. అందులో కవేరుడు స్నానం చేసి సద్యోముక్తిని పొందాడు.

కృతయుగంలో వృత్రుడను రాక్షసుడు కాలకేయాదులతో కలసి ఇంద్రునిపై దండెత్తగా. ఇంద్రుడు వృత్రిని సంహరించాడు. కాని కాలకేయాదులు సముద్రంలో దాగి రాత్రులందు బ్రాహ్మణులను చంపి ఆశ్రమాలలో ఉపద్రవాలు చేయటం ప్రారంభించారు. ఇంద్రాది దేవతలు విష్ణుమూర్తిని ప్రార్థించగా,"అగస్త్యమహర్షి సముద్రజలాలను పానం చేస్తాడు. అప్పుడు మీరు కాలకేయాదులను వధించండి" అని ఆనతిచ్చాడు. దేవహితార్థమే అగస్త్యుడు సముద్రాన్ని ఆపోశనం పట్టాడు. దేవతలు విజృంభించి కాకేయాదులను వధించారు. అందువలన అతనికి 'పీత సముద్రుడు' అని పేరు కలిగింది.

- సశేషం

# వాసనలు

- పాలూరి శివరామ కాళీప్రసాద్

వేదాంత పరిభాషలో 'వాసనలు' మూడు రకాలు. దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన. అసలీ వాసనలంటే ఏమిటో అవి ఎలా వస్తాయో తెలుసుకుందాం.

శరీరం ధరించిన ప్రతివాడికీ ఆ శరీరం ఉన్నంతవరకు ఏదో ఒక పని చేస్తూ ఉండక తప్పదు. కానీ గరిటతో కలపవలసిన సాంబారు చేత్తో కలిపితే ఆ చేతికి వాసన అంటుకున్నట్లుగా, శరీరంతో చేయవలసిన పనులకు మనస్సును జత చేస్తే మనస్సుకు ఆ వాసన అంటుకుంటుంది.

శరీరానికి ఆకలి వేసిందనుకోండి, తినగలిగిన పదార్థం అప్పటికి ఏది దొరికితే అది లోపలవేస్తే ఆ ఆకలి తీరిపోతుంది. కానీ ఆ సమయానికి మనం ఏ శరవణ భవన్‌కో వెళ్ళామనుకోండి. శరీరం ఆకలితీరటంతో పాటు అక్కడి వంటకాలు బాగుంటాయి అనే ఒక గుర్తు మనస్సులో నాటుకుపోతుంది. అదే వాసన. అయితే మీరు మనస్సు పెట్టి తినకపోతే యీ వాసన అంటదు. నిజానికి ఆకలి వేయటం, ఆహారం తినటం, కడుపు నిండటం యివన్నీ కేవలం దేహానికి సంబంధించిన విషయాలు. కేవలం ఒక దేహ క్రియగా ఉండవలసిన దానికి మనస్సు చేర్చటంతో అది వాసనగా అంటుకొని చివరకు కర్మగా మారుతుంది.

ఇక దేహవాసన అంటే యీ దేహం నేను అనే నిశ్చితమైన నమ్మకం. అది యీ దేహానికి పెట్టుకున్న పేరుపై కూడా అంతే గాఢంగా ఉంటుంది. నా పేరు ప్రసాద్ అనుకోండి. పిలిచేది నన్నే అని తెలిసినా ప్రసాదరావు అంటే పలకను. పేరు కేవలం దేహానిదే అయినా, అది కేవలం సౌలభ్యం కోసం పెట్టుకున్నదే అయినా, మహాత్ముల సన్నిధిలో కూడా దాని మీద అభిమానాన్ని వదులుకోలేము.

శాస్త్రవాసన అంటే మనం చదువుకున్న పుస్తకాలలో, విన్న

విషయాలలో ఉన్న విజ్ఞానమే సర్వస్వం అని బలంగా విశ్వసించటం. పరిమితమైన మానవ జీవిత కాలంలో పరిపూర్ణ విజ్ఞానాన్ని కేవలం చదువు ద్వారా పొందటం ఎవరికీ సాధ్యం కాదు. కేవలం తనను తాను తెలుసుకున్న బ్రహ్మజ్ఞానికే సర్వం తెలియబడుతుంది.

కానీ మనం మనకున్న పరిమిత జ్ఞానంతోనే అనంతుడైన భగవంతుణ్ణి, ఆయన ప్రతిరూపాలైన మహాత్ములను అంచనా వేయాలని చూస్తాం. మనకు తెలిసిన గుప్పెడు ధర్మసూత్రాలతో ధర్మాధిష్ఠానమైన పరమాత్మనే అంచనా వేయాలని చూస్తూ రాముడు అలా ఎందుకు చేశాడు? కృష్ణుడు అలా ఎందుకు చేశాడు? అని వాదిస్తాము. అనంత విశ్వంలో అతి చిన్న భాగమైన మన సమాజపు కట్టుబాట్లతో అనంతుడైన భగవంతుణ్ణి బంధించాలని చూస్తాం. మన మీద కరుణించి ఆ భగవంతుడే ఏ కుక్క రూపంలోనో ప్రత్యక్షమైతే శాస్త్రాలతో చెప్పిన ఆకారంలో రాలేదని గుర్తించటానికి నిరాకరిస్తాం. తులసీదాసు అంతటి మహాభక్తుడికే యీ పరిస్థితి తప్పలేదు.

ఇక లోకవాసన అంటే ఈ లోకంలో ఎన్నో ఏళ్ళుగా వుంటూ కొన్ని అభిప్రాయాలూ, అలవాట్లూ ముందే ఏర్పరచుకుని ప్రతిదానిని ఆ కోణంలోనే చూస్తాం. ఒక వ్యక్తి మనకు ఏదో మంచో, చెడో చేస్తే, అలాంటి వేషభాషలు, ఆ కులం, ఆ మతం, ఆ జాతికి సంబంధించిన వారందరికీ వాళ్ళెవరో మనకు తెలియకపోయినా, ఆవే గుణాలు అంటగడతాం. సెగరెట్టు కోసం పరాయివాళ్ళని అగ్గిపెట్టె అడగటానికి కూడా సిగ్గుపడం. కానీ ఏ ఆశ్రమానికో, సత్సంగానికో వెళ్ళాలంటే నలుగురూ ఏమి అనుకుంటారో అని సిగ్గుపడతాం.

మన కంటికి కనపడకుండా ఎక్కడో గోడవతల ఉన్న పువ్వు వాసన కూడా మనదాకా చేరినట్లు, ఈ వాసన మనను జన్మజన్మల దాకా వెంటాడుతూనే ఉంటాయి. సాధన ద్వారా మన మనస్సు ప్రక్షాళన చేసుకునే దాకా ఈ వాసనలు తప్పవు.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కోటిపల్లి మామ్మగారు

కోటిపల్లి మామ్మగారికి భద్రాచలంలోని శ్రీరామచంద్రుడంటే ప్రాణం. ఆమె మాటి మాటికీ ఎవరికీ చెప్పకుండానే భద్రాచలం వెళ్ళి రెండు మూడు నెలలు ఉండి వస్తూ ఉండేది. ఒకసారి యింట్లో ఏవో తీవ్రమైన అభిప్రాయ భేదాలు ఏర్పడి, మామ్మగారు విరక్తులై గోదావరిలో పడి ప్రాణ త్యాగం చెయ్యాలని, గోదావరి నది దగ్గరకు వెళ్ళారు. తీరా వెళ్ళాక, "కోటిపల్లిలో చస్తే ఆత్మ హత్యా దోషం చుట్టు కుంటుంది. భద్రాచలం వెళ్ళి, రాముడి అనుమతి తీసుకుని అప్పుడు గోదావరిలో పడితే, ఆత్మహత్యా దోషం లేకుండా, రాముడు తనలో నన్ను కలుపు కుంటాడు" అనుకుని వెనక్కి వచ్చి, భద్రాచలం బస్సు ఎక్కారు. రాత్రి వేళ బస్సు ఏలూరులో ఆగితే, తెలియక అదే భద్రాచలమనుకొని దిగారు. విషయం తెలిసి, ప్రొద్దున్నే భద్రాచలం వెడదామని, పోతునూరు వెళ్ళారు.



అక్కడ మనుమరాలితో (పోతునూరు అక్కయ్య) విషయం ,చెప్పి, "నువ్వు నాతో భద్రాచలం వచ్చి, నా ప్రయత్నం పూర్తి చేయించాలి" అని పట్టు బట్టి నిరాహారంగా కూర్చున్నారు. పోతునూరు అక్కయ్య వుపాయంగా "శ్రీ బాబుకు, భద్రాచల రాముడికి భేదం ఉందా?"అని అడిగేసరికి, మామ్మగారు "ఎంత మాట అన్నావే?" అని కొట్టబోయారు. "అయితే మనం ఆశ్రమంలో, శ్రీ బాబు రూపంలో ఉన్న భద్రాచల రాముడి వద్దకు వెళ్ళి, అనుమతి తీసుకుందాము. అప్పుడు నేను తప్పక నీకు సాయంగా ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను" అన్నారు పోతునూరు అక్కయ్య. మామ్మగారు "బాబుగారు మనకు కనబడుతూ మాట్లాడే రాముడు కదా! తీరా ఆయన నన్ను భద్రాచలం వెళ్ళ వద్దంటే, నేను ఆగిపోవలసి వస్తుంది. నాకు బ్రతకాలని లేదు. కనుక భద్రాచలంలో వున్న మాట్లాడని రామునితో చెప్పి గోదావరిలో మునుగుతాను. ఆయన వద్దని

అనడు కదా!" అన్నారు. పోతునూరు అక్కయ్య "అలాగైతే మనం ఆశ్రమానికి వెళ్ళి బాబుకు కనబడకుండా, ఆయన ఉండే భవనం వైపు తిరిగి నమస్కరించుకొని భద్రాచలం వెళ్ళిపోదాము" అని మామ్మగారిని ఒప్పించారు.

తీరా వాళ్ళిదరు ఆశ్రమంలో అడుగు పెట్టేసరికి, భక్తులతో సహా శ్రీ బాబు ఎదురుగా వచ్చి "వచ్చావా అమ్మమ్మా! నీ కోసమే ఎదురు చూస్తున్నాను"అని, మామ్మగారిని ప్రేమతో దగ్గరకు తీసుకుని "అమ్మమ్మా! ఎవళ్ళో నీవాళ్ళనుకున్న బంధువులు నీకు మనస్తాపం కలిగించారని, నాకు కూడా దూరం అయిపోవాలనుకున్నావా? నీకు నారాయణ పురంలో యీ రూపంలోనే కనిపించి, యీ ఆశ్రమమంతా చూపించి, యిక్కడ నిన్ను నా దగ్గర ఉంచుకొని జాగ్రత్తగా చూసుకుంటానని మాట యిచ్చాను గదా? మరి నా మాట చెల్లకుండా చేస్తావా?ఇది న్యాయమేనా?నీకు నేను నిజంగా మనవణ్ణని, నేను అన్నమాట నెరవేరుస్తానని నీకు నమ్మకం ఉంటే, మళ్ళీ వేరే భద్రాచలం వెళ్ళటం ఎందుకు?ఇది భద్రాచలం కాదా? నీ మొర వినేందుకు యిక్కడ రాముడు లేడా? ఇక్కడ నిరంతరం జరిగే నామ సంకీర్తనామృత ప్రవాహము, పవిత్ర గోదావరి కాదా? ఆ గోదావరిలోనే నీవు నిజంగా దూకి, అందులోనే మునిగిపోగలిగితే, ఏ పాపమూ నిన్ను దరిచేరక పోగా, కైవల్యమే నీకు కలగదా?నేను చెబుతున్న యీ మాటలలో నీకు నమ్మకం కుదిరితే, యీ క్షణం నుంచి జీవితాంతం వరకు ఎక్కడికీ వెళ్ళకుండా, ఏ బంధువుల బెడదా లేకుండా, యిక్కడే నాతోనే ఉండి, నీ జన్మ సార్థకం చేసుకో, తిండి అంటావా, నేను తిన్నదే నీకు పెడతాను. ఉండటం అంటావా, నా మేడ మెట్ల క్రిందనే ఉండు. లేదా నీవు ఎలా కోరితే అలా ఏర్పాటు చేస్తాను" అన్నారు.

మామ్మగారు శ్రీ బాబు దివ్య చరణారవింద సన్నిధిలో సంపూర్ణ శరణాగతి పొంది ఆత్మార్పణం చేసుకుని, ఆ తరువాత జీవితాంతం వరకూ ఆశ్రమంలోనే ఉండి, శ్రీ బాబు స్మరణతో శ్రీబాబులోనే కలిసిపోయారు. శ్రీ బాబు ఆమెకు నారాయణ పురంలో దర్శనమిచ్చి చేసిన వాగ్ధానాన్ని నెరవేర్చారు.

- సశేషం

-గత సంచిక తరువాయి

విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

# సూరదాస్

సూరదాస్ ఆంతర్యంలో చెలరేగే వైరాగ్యజ్వాలకు బాహ్యంలో అనువైన ఏకాంతం లభించింది. సదా హరినామ సంకీర్తన యందు మనస్సు లగ్నం అవసాగింది. భగవద్దర్శనం కోసం మనస్సు పరుగులు తీసింది. కంటిపై రెప్పవాలదు. భుజించుటకు నాలుక ఇచ్ఛగించదు. భగవద్వియోగ దుఃఖాన్ని అనుభవిస్తూ కన్నీరు కార్చేవాడు. క్రింద పడి దొర్లేవాడు. చేతులు జోడించి ప్రార్థించేవాడు లేదా నిశ్చేష్టుడైపడి ఉండేవాడు.



సూరదాస్ అంతఃకరణ భగవద్దర్శనానికి పరితపిస్తూ ఉన్న తరుణంలో శుద్ధాద్వైత వైష్ణవ సిద్ధాంత మూల పురుషులగు వల్లభాచార్యులవారు తీర్థయాత్రలు చేస్తూ, సూరదాస్ ఉన్న ప్రాంతానికి వచ్చారు. సూరదాస్‌కు ఆ మహాత్ముని దర్శించాలి అనే కోరిక కలిగింది. వెంటనే సూరదాస్ బయలుదేరి శ్రీవల్లభాచార్యులవారి సన్నిధానమును చేరి వారి పాదములకు సాష్టాంగ నమస్కారం చేశాడు, వారి పాదస్పర్శ చేత సూరదాస్ లోని భక్తి వీర్యవంతమై ఆనంద వృక్షంగా మారింది.

సూరదాస్ భక్తి శ్రద్ధలు శ్రీవల్లభాచార్యుల వారికి అవగతమయ్యాయి. రాధాకృష్ణుల ప్రేమ తత్త్వాన్ని గురించి సూరదాస్‌కు భోధించారు. రాధాకృష్ణ లీలా మాధుర్యం లోని ఆధ్యాత్మిక రహస్యాలను ఎరుక పరిచారు. సూరదాస్ ఆనందానికి అవధులు లేవు. శ్రీవారు అతనికి మంత్ర దీక్షను ఇచ్చి అనుగ్రహించారు. సూరదాస్‌లో అప్పటి నుండి ఒక దివ్య పరిణామము కలిగింది. అత్యద్భుతంగా అతని నుండి కవిత్వం రాసాగింది. రాధాకృష్ణుల దివ్యలీలలను ఆయన గానం చేశారు. ఆకీర్తనలే“సూరసాగర్ ”అనే పేరుతో ప్రాచుర్యం పొందాయి. సూరసాగర్‌లో

ఆయన వ్రాసిన లక్ష కీర్తనలలో మనకి ఎనిమిది వేలే లభిస్తున్నాయి. భాగవతంలోని భక్తితత్త్వాన్ని, ఆధ్యాత్మిక నిగూఢ రహస్యాలను సూరసాగర్ యందు వర్ణన చేశాడు. ప్రతి సన్నివేశము ఆయన కళ్లతో చూచినట్లే చిత్రించటం ఆయన ప్రతిభా విశేషం. సూరసాగర్ లోని ఒక ఆణిముత్యమైన కీర్తనను గురించి మనం తెలుసుకుందాం. ఈ కీర్తనలో భక్తుని హృదయంలో భగవంతుని కొరకు చెలరేగిన పరితాపము భగవద్దర్శనంతోనే తీరుతుంది అనే భావనను సూరదాస్ శ్రీరాధాకృష్ణుల ప్రణయ గాథ ద్వారా ఎంతో మనోరంజకంగా తెలియ చేశారు.

"రాధ ఒకనాడు చెలికత్తెలతో కలిసి క్రీడిస్తోంది. కొన్నిక్షణాలు రాధ కనుపించలేదు. చెలులు రాధకొరకు అన్వేషించసాగారు. ఒక వృక్షఛాయలో పడి ఉన్న రాధను చూసి భీతి చెందారు. ఏదో సర్పం కాటువేసి ఉంటుందని అనుకున్నారు. పరిగెత్తుకుంటూ వెళ్ళి రాధ తల్లి అయిన సునయినాదేవితో "అమ్మా! నీ బిడ్డ అయిన రాధను కృష్ణ సర్పం కాటు వేసింద"ని చెప్పారు.

సునయనాదేవి శరీరం కంపిస్తోంది. నేత్రాల వెంట అశ్రుధారలు కారుతున్నాయి. కంఠం గద్గదం అవుతోంది. ఆమె దైన్యంగా విలపించసాగింది. ఆమె భాధను చూసి ఒక వృద్ధుడు "అమ్మా సునయనాదేవీ! ఆపదను చింతిస్తూ నీమనస్సు అల్లాడుతోంది. ఆపద నుండి బయటపడే ఉపాయాన్ని ఆలోచించాలి. రాధను కృష్ణ సర్పం కాటువేస్తే దానికి విరుగుడు వేయాలి. అది కృష్ణుడికే సాధ్యం అతనిని తొందరగా పిలిపించండి" అని సలహా ఇచ్చాడు. ఆ మాటలు విన్న సునయనాదేవి- నంద సువనగారుడీ బులావహు కహ్యే హమారౌ సునతనకొవూ, తురత జాహు, లే ఆవహు -" త్వరగా వెళ్ళి నందకిశోరుడిని తీసుకొని రండి. నాబిడ్డ ఏ ఆపదలో ఉన్నదో?" అని విలపిస్తోంది.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL